# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

11.01.2026 ఆదివారం Sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 188 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




## బంగ్లాలో ఆగని దాడులు

దుండగుల దాడిలో మరో హిందువు హత్య

4

## ఇరాన్‌లో ముదురుతున్న అల్లర్లు

కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరిక

ఆందోళనకారులను దేశ శత్రువులుగా పరిగణిస్తామని ప్రకటన

4



గత రెండు వారాలుగా ఇరాన్‌లో రగులుతున్న ప్రభుత్వ వ్యతిరేక జ్వాలలు అంతకంతకూ ఉధృతమవుతుండగా, ఆందోళనకారులపై అక్కడి ప్రభుత్వం కఠిన వైఖరితో ముందుకెళ్తోంది. నిరసనల్లో పాల్గొంటే దేశద్రోహులుగా పరిగణించి మరణశిక్షలు విధిస్తామని హెచ్చరిస్తూనే, మరోవైపు ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచేసింది. ఈ నేపథ్యంలో మీరు అడిగినట్లు మంచి లీడ్‌తో వార్తా కథనం కింద ఉంది.

4

# సాంకేతికత పెరిగినా మానవీయత మరవొద్దు

యంత్రాలనే నమ్ముకోకుండా ప్రజల నాడి పట్టుకోవాలని హితవు

## హెచ్ఐసీసీలో జరిగిన 'ఫెలోస్ ఇండియా' సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి



- ప్రజారోగ్య సంరక్షణకే ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్పష్టీకరణ
- హెల్త్ పాలసీల రూపకల్పనలో వైద్యుల సలహాలు తీసుకుంటాం
- పాఠశాల విద్యార్థులకు సీపీఆర్ నేర్పించాలని పిలుపు
- నేను సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే డాక్టర్‌ను: సీఎం
- లైఫ్ సైన్సెస్, ఫార్మా హబ్‌గా హైదరాబాద్ ఎదుగుదల
- తెలంగాణ గ్లోబల్ హెల్త్ హబ్‌గా మారాలని ఆకాంక్ష

**హైదరాబాద్, జనవరి 10:** వైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినప్పటికీ, వైద్యులు తమ సామాజిక బాధ్యతను, మానవీయ కోణాన్ని విస్మరించవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫెలోస్ ఇండియా' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్య వృత్తి కేవలం చికిత్సకే పరిమితం కాకూడదని, అది సమాజ సేవలో అంతర్భాగమని గుర్తుచేశారు. ప్రస్తుతం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, వైద్యులు ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. అయితే కేవలం యంత్రాలు, రిపోర్టుల మీదనే ఆధారపడకుండా ప్రజల నాడి పట్టుకోవడం కూడా అంతే ముఖ్యమని హితవు పలికారు. రోగిని మానసికంగా అర్థం చేసుకుని వైద్యం అందించాలని, గుండె జబ్బుల నివారణలో అందరూ భాగస్వాములు

మిగతా 3 లో

## తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

- ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును సత్వరం చేపట్టేలా చూడండి
- మూసీ రివర్ ఫ్రంట్‌కు ఆర్థిక చేయూతను ఇవ్వండి
- ప్రీ బడ్జెట్ సమావేశంలో కేంద్రానికి భట్టి వినతి



3

## భక్తుల సంఖ్యకు అనుగుణంగా మేడారంలో మెడికల్ క్యాంపులు

తక్షణ సేవలు అందించేలా ప్రణాళిక

వైద్యాధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

3



## వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చించడం బాధాకరం

నిరాధార వార్తలతో అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతీయవద్దు

- మహిళా ఐఏఎస్‌పై తప్పుడు కథనాలు హేయం
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

3



## మహిళా అధికారిపై తప్పుడు రాతలు హేయం

కొడుకు పోయినప్పుడే నేను సగం చచ్చిపోయా.. మానసికంగా వేధించవద్దు

3

కుటుంబాలను ఇబ్బంది పెట్టొద్దని మంత్రి కోమటిరెడ్డి హితవు



## పట్టణాలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయం

నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం

02



02

## తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న జనసేన





## దగ్గు మందుపై నిషేధం

ఆల్మంట్ కిడ్ సిరప్ వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదేశం

.. వివరాలు 3లో

## ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానం

- చరిత్ర పాఠాల నుంచి ప్రేరణ పొందాలి
- మన స్వాతంత్య్ర యోధుల ధీరత్వం పుణికి పుచ్చుకోవాలి
- వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో అజిత్ ధోవల్



వివరాలు 4వ పేజీలో

# పంజాగుట్ట ఆలయంలో బండి పూజలు

## మోడీ గోత్నామాలతో అర్చన



**హైదరాబాద్,జనవరి 10:** పంజాగుట్టలో ఉన్న శ్రీదుర్గా భవాని ఆయలంలో కొలువైన దుర్గామల్లేశ్వర స్వామిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గోత్రనామాలతో ఆయన అర్చన చేయించారు. ఆలయ కమిటీ కేంద్ర మంత్రిని శాలువాతో సన్మానించింది. ఆలయంలో కొలువైన దుర్గాభవాని అమ్మవారు, మేధా దక్షిణామూర్తి స్వామిని కూడా ఆయన దర్శించుకుని పూజలు చేశారు. కేంద్ర మంత్రిని పూలమాల, శాలువాతో ఆలయ కమిటీ సత్కరించింది. సుమారు 15 నిమిషాల పాటు శ్రీదుర్గాభవాని ఆలయంలో కేంద్ర మంత్రి గడిపారు. సోమనాథ్ ఆలయంపై దాడి జరిగి వెయ్యేళ్లు అయిన సందర్భంగా బీజేపీ పార్టీ సోమనాథ్ స్వాభిమాన్ పర్వం నిర్వహిస్తోంది. వెయ్యేళ్లు ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ ఆ ఆలయం ఇప్పటికీ సగర్వంగా, వైభవోపేతంగా నిలబడింది. అయితే ఆలయ పునర్ నిర్మాణం చేపట్టి 75 ఏళ్లు అవుతున్నది. 1951లో ఆ ఆలయాన్ని రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో భక్తుల కోసం తెరిచారు.

# శ్రీవారిని దర్శించుకున్న తలసాని



**తిరుమల,జనవరి 10:** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి దర్శనం అనంతరం బయటికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు అంతా సుఖ సంతోషాలతో ఉండాలని తలసాని ఆకాంక్ష వెలిబుచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# హార్వర్డ్ వర్సిటీ కాన్ఫరెన్స్‌కు కెటిఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్,జనవరి 10:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరగబోయే 23వ ఎడిషన్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ప్రసంగించాలని ఆహ్వానం లభించింది. హైదరాబాద్, తెలంగాణపై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తిని పెంపొందించడంలో కేటీఆర్ కీలక కృషికి గానూ ఈ ఆహ్వానం అందినట్లుగా నిర్వాహకులు తెలిపారు. హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో ఈ కాన్ఫరెన్స్ జరగనుంది. ది ఇండియా వి ఇమాజిన్ అనే థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు భారత్, దక్షిణాసియా దేశాలకు చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్లు, వ్యాపారవేత్తలు, పాలసీ మేకర్స్, సాంస్కృతిక రంగ నిపుణులు హాజరుకానున్నారు. గతంలో ఈ సదస్సుల్లో నీతా అంబానీ, నితిన్ గడ్కరీ, జైరాం రమేశ్, అజీమ్ ప్రేమ్‌జీ వంటి ప్రముఖులు హాజరై ప్రసంగించారు. తాజాగా కేటీఆర్‌కు కూడా ఈ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించాలని ఆహ్వానం అందడం విశేషం. తెలంగాణను టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టడంలో కేటీఆర్ చేసిన కృషికి గుర్తింపుగా ఈ ఆహ్వానం అందిందని నిర్వాహకులు ప్రెస్‌నోట్‌లో తెలిపారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో తొలి రోజు జరగబోయే సదస్సులో పాలన, అభివృద్ధి, పబ్లిక్ పాలసీలపై చర్చ జరగనుంది. ఇక రెండో రోజు హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో బిజినెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, గ్లోబల్ ఎకానమీ అంశాలపై చర్చ జరగనుంది. రెండో రోజు జరిగే ఈ సమావేశంలోనే కేటీఆర్ ప్రసంగించనున్నారు.

# ఏకశిల వెంచర్‌లో ఉద్రిక్తత

## పోలీసుల ముందే పరస్పర దాడులు

**మేడ్చల్,జనవరి10:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్ కేసర్ రెవెన్యూ పరిధిలో ఏకశిలా వెంచర్‌లో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసుల సమక్షంలోనే ఇరువర్గాల పరస్పర దాడులతో ఆ ప్రాంతం రణరంగంలా మారింది. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గత కొన్నాళ్లుగా ఏకశిలా ప్లాట్ల యజమానులు, ఏకశిల భూములను కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారి వెంకటేశ్ మధ్య గొడవలు జరుగుతున్నాయి. ప్లాట్ యజమానులను అక్కడికి వెళ్లనీయకుండా.. ఏకశిలా వెంచర్ చుట్టూ వెంకటేష్ అనుచరుల పహారా ఉండేది. యాజమానులను భయభ్రాంతులకు గురిచేసి, దౌర్జన్యానికి దిగడంతో వెంకటేష్ అనుచరులపై పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. కొంతకాలం పోచారం పోలీసులు ఏకశిలా వెంచర్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పికెటింగ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏకశిలా వెంచర్‌లో సర్వే కోసం వచ్చిన అధికారులను ఎ÷–లాట్ల యజమానులు అడ్డుకుని, ఆందోళనకు దిగారు. శనివారం ఏకశిలా ప్లాట్ల యజమానులు కొందరు అక్కడికి వెళ్లగా.. స్థిరాస్తి వ్యాపారి వెంకటేశ్ అనుచరులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి అదుపు చేసేందుకు వచ్చిన పోచారం పోలీసుల ఎదుటే ఇనుప రాడ్లతో దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో నలుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాలు పోచారం, మేడిపల్లి పీఎస్‌లలో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి.

# పట్టణాలను సంక్షోభం నెట్టిన కాంగ్రెస్

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయం
- నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం




**హైదరాబాద్, జనవరి 10:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.రెండు సంవత్సరాలుగా పట్టణాలను సంక్షోభం నెట్టిన కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందన్నారు. రానున్న పురపాలక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెబుతారని.. పట్టణ ప్రాంతాల ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లో నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నేతల సమావేశంలో పార్టీ నేతలకు పురపాలక ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాల పైన కేటీఆర్ దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ఏ పట్టణానికి చెల్లించని ఏకైక ప్రభుత్వంగా చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో పట్టణాల్లో పరిపాలన పూర్తిగా పడకేసిందని పారిశుద్ధ్య నుంచి మొదలుకొని ప్రతి అంశంలో పట్టణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వం కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం తప్పించి? ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదని కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, కమ్యూనిటీ హాల్, మోడల్ మార్కెట్ల వంటి ప్రతి ఒక్క కార్యక్రమానికి నిధులు ఆపివేయడంతో అన్ని కార్యక్రమాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను వ్యవసాయనం గాని సంక్షోభంలోకి నెడుతూ.. మరోవైపు పట్టణాలను పడుకోబెట్టి ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుందన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో ఆయా పట్టణాలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను? ఇచ్చిన నిధులను వివరించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీ నేతలకు కేటీఆర్ సవాలు చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పార్టీ తరఫున చేసుకోవాల్సిన ఏర్పాట్లను ప్రజల ముందు ఉంచాల్సిన వివిధ అంశాలను కేటీఆర్ ఈ సందర్భంగా పార్టీ నేతలకు తెలియజేశారు. రెండు జిల్లాలకు సంబంధించిన ప్రతి మున్సిపాలిటీలోని క్షేత్రస్థాయి పరిస్థితులపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలను, అధికార దుర్వినియోగాన్ని తట్టుకొని మంచి ఫలితాలు సాధించామని.. ఇదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు హాజరైన ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేత, శాసనసభ డిప్యూటీ ఎ÷–లోర్ లీడర్ హరీష్ రావు పలు అంశాలపైన నేతలకు దిశా నిర్దేశర చేశారు. కలిసికట్టుగా సమిష్టిగా కొట్లాడి ఎన్నికల్లో మంచి విజయం సాధించాలని హరీష్ రావు సూచించారు. ఈ సందర్భంగా పురపాలక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం పైన పలు అంశాలను హరీష్ రావు నేతలకు వివరించారు. ఈ సమావేశాల సందర్భంగా ఆయా జిల్లాల నేతలు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పార్టీ సీనియర్ నేతలకు వివరించారు. ప్రభుత్వం పైన క్షేత్రస్థాయిలో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నదని పార్టీకి అనుకూల వాతావరణ ఉన్నదని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయా జిల్లాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు హాజరయ్యారు.

# తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం

## మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న జనసేన

**హైదరాబాద్, జనవరి 10:** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమని జనసేన పార్టీ అధికారికంగా ప్రకటించింది. శనివారం ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి రామ్ ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ, రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు నెల రోజుల కంటే తక్కువ సమయం ఉన్నప్పటికీ, తెలంగాణలోని సాధ్యమైనన్ని మున్సిపల్ స్థానాల్లో జనసేన అభ్యర్థులను బరిలోకి దించుతామని పార్టీ స్పష్టం చేసింది. ఇందుకోసం పార్టీ ఇప్పటికే తన కార్యచరణను ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న జనసైనికులు, వీరమహిళలు ఈ ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి తోడ్పడాలని పార్టీ పిలుపునిచ్చింది. ఈ ఎన్నికల ద్వారా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను, ఆయన భావజాలాన్ని తెలంగాణలోని ప్రతి ఇంటికీ చేరవేయడమే ప్రధాన ఉద్దేశ్యమని జనసేన వెల్లడించింది. పవన్ కళ్యాణ్ కి తెలంగాణ ప్రాంతం పట్ల ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని ప్రజలకు వివరించి, రాష్ట్రంలో ఒక సరికొత్త రాజకీయ వేదికకు బలమైన పునాది వేయడమే ఈ పోటీ వెనుక ఉన్న అసలు లక్ష్యమని పార్టీ తన ప్రకటనలో వివరించింది. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన ఎంట్రీ ఇవ్వడంతో తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారనున్నాయి. 2019 ఎన్నికలలో నేరుగా ఆంధ్రప్రదేశ్ లో పోటీ చేసినా, కేవలం ఒక సీటు మాత్రమే




గెలిచింది. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీతో కలిసి కూటమి స్థాపించి, 21 సీట్లకు గాను 21 సీట్లు గెలిచి వందశాతం స్ట్రైక్ రేటు సాధించించి. జనసేన పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుర్తింపు పొందింది.

# అంబర్‌పేట ఎస్సై భానుప్రకాశ్ రెడ్డి అరెస్టు

## సర్వీస్ రివాల్వర్ మిస్సింగ్ కేసులోనూ దర్యాప్తు

**హైదరాబాద్,జనవరి 10:** హైదరాబాద్ అంబర్‌పేట ఎస్సై భానుప్రకాశ్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. చోరీ కేసులో రికవరీ చేసిన సొమ్మును వాడుకున్న కేసులో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అతను రిమాండ్‌లో ఉన్నట్లు సమాచారం. మరోవైపు సర్వీస్ రివాల్వర్ మిస్సింగ్ కేసులోనూ దర్యాప్తు కొనసాగుతోంది. అంబర్‌పేట ఎస్ఐ భానుప్రకాశ్‌కు సంబంధించిన 9 ఎంఎం సర్వీస్ రివాల్వర్ మిస్సింగ్ వ్యవహారం ఇప్పటికీ కొలిక్కి రాలేదు. విజయవాడలో ఓ లాడ్జిలో తాను చదువుకునే పుస్తకాల దగ్గర పెట్టుకున్నప్పుడు అది మిస్ అయిందంటూ ఎస్ఐ చెప్పడంతో హైదరాబాద్ పోలీసులు విజయవాడలోని లాడ్జి, అందులో పనిచేసే బాయ్స్, హోటల్ యజమానిని ప్రశ్నించారు. సీసీటీవీ ఫుటేజ్ కూడా పరిశీలించారు. తుపాకీకి సంబంధించిన ఆనవాళ్లు కనిపించలేదు.. అసలు ఆ తుపాకీ వ్యవహారమేంటో తమకు తెలియదని లాడ్జి యాజమాన్యం చెప్పినట్లు సమాచారం. బెట్టింగ్ బాబు భాను ప్రకాశ్ తన జల్సాల కోసం తుపాకీని అమ్మేశాడంటూ ఆయన బ్యాచ్‌మేట్స్ చెప్పుకుంటున్నారు. తాను ట్రైనింగ్ తీసుకునే సమయంలో కూడా విపరీతంగా బెట్టింగ్ ఆడేవాడని, ఆ తర్వాత తన ఇంట్లో బంగారం తీసుకొచ్చి కూడా బెట్టింగ్‌లో పెట్టాడని ఆయన సహచరులు చెప్పారు. ఏపీలో తనకు పీసీబీలో ఉద్యోగం వచ్చిన తరువాత అందులో జాయిన్ కావాలంటే ఇక్కడ ఎన్ఓసీ తీసుకోవాలని అందుకోసం ఇక్కడకు వచ్చి తన డ్రాలో చూసుకుని రివాల్వర్ కనిపించడం లేదని చెప్పడం, ఆ తర్వాత తన వెంటనే తీసుకెళ్లి తుపాకీని విజయవాడ లాడ్జి మరిచిపోయినట్లు చెప్పడం.. ఇలా పొంతన లేని మాటలతో కాలయాపన చేస్తున్నారు.. టాస్క్‌ఫోర్స్‌ను ఉరికిస్తున్నారు తప్ప అసలు రహస్యం ఇప్పటికీ భానుప్రకాశ్ నోటివెంట బయటకు రావడం లేదు. ఇప్పటికే ఆ తుపాకీ ఎన్ని చేతులు మారిందనేది ప్రస్తుతం పోలీస్‌శాఖలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా తుపాకీ కుదువ పెట్టి మొదట్లో ఐదు లక్షలు తెచ్చుకున్న తర్వాత మళ్లీ పైసల కోసం వెళ్తే అది అమ్మేస్తానని చెప్పడంతో ఆ తుపాకీని రాయలసీమ గ్యాంగ్స్‌కు అమ్మేసినట్లుగా ప్రచారం జరుగుతుంది. ఇందులో ఎంత నిజముందో తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నించినా చిన్న క్లూ కూడా దొరకడం లేదని ఓ సీనియర్ ఆఫీసర్ చెప్పారు. అసలు సర్వీస్ రివాల్వర్ విషయంలో ఇంత నిర్లక్ష్యంగా ఉంటారా అంటూ పోలీసులే మాట్లాడుకుంటున్నారు. మరోవైపు సస్పెన్షన్‌కు గురైన అధికారుల నుంచి సర్వీస్ గన్స్ స్వాధీనం చేసుకోవడం లేదని తెలుస్తుంది. 9ఎంఎం పిస్టల్‌కు సంబంధించి బుల్లెట్లు కూడా బయట దొరకవని పోలీసులు అనుకుంటున్నారు. ఏదేమైనా గన్ మిస్సింగ్ వ్యవహారం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది.







# చిన్నకోడూరు మండలంలో విషాద ఘటన

## చెక్ డ్యామ్‌లో పడి ఇద్దరు బాలలు, మహిళ మృతి

**సిద్దిపేట,జనవరి10:** సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు మండలంలో విషాదం చోటుచేసుకుంది. కస్తూరిపల్లిలో చెక్ డ్యామ్‌లో పడి ముగ్గురు మృతి చెందారు. ఇద్దరిని రక్షించబోయి మహిళ కూడా మృతి చెందారు. ఐదు రోజుల క్రితం బతుకుదెరువు కోసం బిహార్ నుంచి వచ్చిన రెండు కుటుంబాలు కస్తూరిపల్లిలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం కిరణ్ కుమార్ (12), బిర్జు (6) చెక్ డ్యామ్ వద్ద స్నానం చేసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటిలో పడిపోయారు. ఇది గమనించిన ఉమాదేవి (32) వారిని రక్షించబోయి తానూ నీటిలో పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో ముగ్గురి మృతదేహాలను బయటకు తీయించారు. మృతుల్లో తల్లి, కుమారుడు ఉన్నారు.



# సాంకేతికత పెరిగినా మానవీయత మరవొద్దు

మొదటి పేజీ తరువాయి

కావాలని కోరారు. రాష్ట్రంలో ప్రజారోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆరోగ్య విధానాలను మరింత బలోపేతం చేయడానికి క్షేత్రస్థాయి అనుభవం ఉన్న వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైద్యులు తమ అమూల్యమైన సూచనలు అందిస్తే విధాన నిర్ణయాల్లో పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రాణరక్షణ కోసం ప్రభుత్వం, వైద్యులు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. గుండెపోటు మరణాలను నివారించేందుకు పాఠశాల స్థాయి నుంచే చర్యలు చేపట్టాలని సీఎం అభిప్రాయపడ్డారు. వైద్యులు స్వచ్ఛందంగా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు సీపీఆర్ నేర్పిస్తే, భవిష్యత్తులో అనేక ప్రాణాలు కాపాడవచ్చని విశ్లేషించారు. ఈ సందర్భంగా సీఎం చమత్కరిస్తూ.. తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ, సమాజంలోని సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే డాక్టర్‌నని




వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరం లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదుగుతోందని, వైద్య రంగంలోనూ తెలంగాణ అత్యుత్తమంగా నిలవాలని ఆకాంక్షించారు.

# తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి



- ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును సత్వరం చేపట్టేలా చూడండి
- మూసీ రివర్ ఫ్రంట్‌కు ఆర్థిక చేయూతను ఇవ్వండి
- ప్రీ బడ్జెట్ సమావేశంలో కేంద్రానికి భట్టి వినతి

**న్యూఢిల్లీ, జనవరి 10:** తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బ్జడెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ఆయన రాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఒక దేశం కేంద్ర-రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బ్జడెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నమ్ముతున్నానని భట్టి అన్నారు. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది. రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి. రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతున్నాము. విద్య, ఆరోగ్య రంగాల కోసం సేకరించే వనరులను ఎఫ్‌బిఆర్ఎం పరిమితుల నుంచి మినహాయించాలి. తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము. కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము. ప్రస్తుతం సెస్‌లు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను బదిలీని సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది. దాదాపు రూ1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి. తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2: దీనికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి. హైదరాబాద్‌లో ఐఐఎంఏర్పాటును ప్రకటించాలి. మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# భక్తుల సంఖ్యకు అనుగుణంగా మేడారంలో మెడికల్ క్యాంపులు

**తక్షణ సేవలు అందించేలా ప్రణాళిక**

**వైద్యాధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం**

**హైదరాబాద్, జనవరి 10:** మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు. భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఄాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన రూట్లలో, ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్-రూట్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో 72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారు. గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. చిన్నపిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు 248 రకాల మందులు, సర్జికల్ సామాగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 25వ తేదీ నుంచి అన్ని వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రణాళిక రూపొందించా మన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

# పాక్‌లోనూ హిందూ యువకుడి హత్య

**దగ్గర నుంచి రివాల్వర్‌తో కాల్చిన దుండగులు**

**న్యూఢిల్లీ,జనవరి 10:** ఒక పక్క బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులతో ఆందోళన వ్యక్తమవుతుంటే.. ఇప్పుడు పాకిస్తాన్ లో కూడా హిందువును కాల్చి చంపారు. గతవారం పాకిస్తాన్ లో కైలాష్ కోహ్లి (25) అనే యువకుడిని దుండగులు అతి సమీపంనుంచి కాల్చి చంపారు. ఈ ఘటన పాకిస్తాన్లోని, సింధ్ ప్రావిన్స్, బదిన్ జిల్లా తల్హార్ తహసిల్ పరిధిలో జనవరి 4న జరిగింది. పోలీసులు, మీడియా కథనం ప్రకారం.. హిందువైన కైలాష్ స్థానికంగా వ్యవసాయం చేస్తూ ఉండేవాడు. అతడు సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా ఉండేవాడు. అక్కడి హిందువులపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ.. గళమెత్తేవాడు. దీంతో అతడికి స్థానిక నాయకుడిగా గుర్తింపు ఉంది. ఈ క్రమంలోనే అతడిని ఈ నెల 4న గుర్తు తెలియని వ్యక్తులు అతి సమీపం నుంచి కాల్చి చంపారు. బుల్లెట్లు అతడి ఛాతీలో దిగడంతో కైలాష్ అక్కడికక్కడే మరణించాడు. అతడి హత్య జరిగినప్పటి నుంచి అక్కడి హిందువుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఇటీవల మరింత ఉధృతంగా ఆందోళన చేస్తున్నారు. బదిన్ ప్రాంతంలోని రోడ్లను ఆందోళనకారుల బ్లాక్ చేశారు. కైలాష్ మృతికి న్యాయం చేయాలని, హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వరుసగా రెండు రోజులనుంచి నిరసనలు కొనసాగుతున్నాయి.



# మహిళా అధికారిపై తప్పుడు రాతలు హేయం

**కొడుకు పోయినప్పుడే నేను సగం చచ్చిపోయా.. మానసికంగా వేధించవద్దు**

**కుటుంబాలను ఇబ్బంది పెట్టొద్దని మంత్రి కోమటిరెడ్డి హితవు**

**హైదరాబాద్, జనవరి 10:** కొందరు మంత్రులు, మహిళా ఐఏఎస్ అధికారిని లక్ష్యంగా చేసుకుని వస్తున్న వార్తలను రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో, కొన్ని ఛానళ్లలో మహిళా అధికారులపై అసభ్యకరమైన భాషలో వార్తలు రాయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి ఐఏఎస్, ఐపీఎస్ స్థాయికి వచ్చిన వారిపై ఇలాంటి అభాండాలు వేయడం సరికాదని, ఇది వారి కుటుంబాలను తీవ్ర మనోవేదనకు గురిచేస్తుందని హితవు పలికారు. అధికారుల బదిలీలు పూర్తిగా ముఖ్యమంత్రి పరిధిలోని అంశమని, జిల్లా మంత్రులకు చెప్పి సీఎం బదిలీలు చేయరని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేయడానికే ఇదంతా ఓ కుట్రలా జరుగుతోందని, తప్పుడు వార్తలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



ఈ సందర్భంగా మంత్రి తన వ్యక్తిగత జీవితంలోని విషాదాన్ని గుర్తుచేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. "నా కొడుకు చనిపోయినప్పుడే నేను సగం చనిపోయాను. నన్ను ఇంకా మానసికంగా ఇబ్బంది పెట్టొద్దు. దేవుడంటే నాకు నమ్మకం ఉంది, తెలిసి నేను ఏ తప్పు చేయను. ఒకవేళ తప్పు చేస్తే దేవుడే శిక్షిస్తాడు. కేవలం రాజకీయ విమర్శలు ఉంటే భరిస్తాం కానీ, కుటుంబ సభ్యులు బాధపడేలా వ్యక్తిగత దూషణలు చేస్తే ఎలా?" అని కోమటిరెడ్డి ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు చేసేముందు నిజానిజాలు పరిశీలించుకోవాలని సూచించారు. సినిమా టికెట్ల రేట్ల పెంపు అంశంపై మంత్రి స్పందిస్తూ, ఆ వ్యవహారంతో తనకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. పుష్ప సినిమా రిలీజ్ సమయంలో ఒక మహిళ చనిపోవడం తనను కలిచివేసిందని, అప్పటి నుంచి సినిమా ఇండస్ట్రీ విషయాలను పట్టించుకోవడం మానేశానని తెలిపారు. టికెట్ల పెంపు కోసం తన వద్దకు రావొద్దని చెప్పానని, తాజా పెంపు దస్త్రాలపై తాను సంతకం చేయలేదని స్పష్టం చేశారు. సంక్రాంతి ప్రయాణాల గురించి మంత్రి వివరిస్తూ, ఈసారి పండుగకు సుమారు 12 లక్షల వాహనాలు హైదరాబాద్ నుంచి వెళ్లే అవకాశం ఉందని అంచనా వేశారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు టోల్ చార్జీలు లేకుండా గేట్లు ఎత్తేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. జాతీయ రహదారులపై ప్రతి 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచామని, అత్యవసరమైతే క్షతగాత్రులను తరలించడానికి హెలికాప్టర్ సేవలను కూడా వినియోగిస్తామని మంత్రి వెల్లడించారు.

# వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చించడం బాధాకరం

**నిరాధార వార్తలతో అధికారుల ఆత్మస్థయిర్యం దెబ్బతీయవద్దు**

**మహిళా ఐఏఎస్‌పై తప్పుడు కథనాలు హేయం**

**పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, జనవరి 10:** వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చించడం బాధాకరమని, వాస్తవానికి దూరంగా కథనాలు అల్లడం సరికాదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియా సంస్థలో తప్పుడు కథనాలు ప్రసారం కావడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎంతో కష్టపడితే తప్ప



ఉన్నత స్థానాలకు చేరుకోలేరని, అలాంటి వారిపై మీడియా సంస్థలు నిరాధారమైన వార్తలను ప్రచురించి వారి ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయవద్దని విజ్ఞప్తి చేశారు. భారతీయ జనతా పార్టీ తీరుపై కూడా మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా అని ప్రశ్నించారు. రాముడి పేరును వాడుకునే హక్కు ఆ పార్టీకి ఎక్కడిదని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం, ఓట్ల కోసం దేవుడి పేరు వాడుకోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాము రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తామని సవాల్ విసిరారు. కేసీఆర్ కేవలం ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్ రావు ఆందోళన చెందుతున్నారని, కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందని, కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాల పేర్లు మార్చడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని, అసలు ఆయా జిల్లాలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే పేరు మార్పు అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు.

# దగ్గుమందుపై నిషేధం

**ఆల్మంట్ కిడ్ సిరప్ వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదేశం**

**హైదరాబాద్,జనవరి 10:** ప్రజలకు తెలంగాణ డ్రగ్ కంట్రోల్ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఆల్మంట్-కిడ్ సిరప్ వినియోగాన్ని వెంటనే నిలిపేయాలని ఆదేశించింది. పిల్లలకు అలర్జీ, జ్వరం, ఆస్తమా వంటి సమస్యలకు ఆల్మంట్ - కిడ్ సిరప్‌ను వినియోగిస్తుంటారు. అయితే ఈ సిరప్‌లో విషపూరితమైన ఇథలీన్ గ్లైకాల్ కలుషితమై ఉన్నట్లు గుర్తించారు. కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి వచ్చిన రిపోర్ట్ ఆధారంగా తెలంగాణ డ్రగ్ కంట్రోల్ ఈ మేరకు హెచ్చరికలు జారీ చేసింది.



నేటి సాక్షి
కరీంనగర్
ఆదివారం 11 జనవరి 2026



సంపాదకీయం

# పాశర్లపూడి నుంచి నేటిదాకా..!

గోదావరి పరవళ్లు, పచ్చటి ప్రకృతి అందాలతో అలరారే కోనసీమలో చమురు, సహజవాయు నిక్షేపాల అన్వేషణకు కొన్ని దశాబ్దాల క్రితం ఒఎన్‌జిసి అడుగుపెట్టింది. అప్పటి నుంచి ఆ ప్రాంత ప్రజలు నిప్పుల కొలిమిని గుండెలపై మోస్తున్నారు. పొలాల్లో, ఇళ్లమధ్య, కాళ్ల కింద ఆయిల్, గ్యాస్ పైపులైన్లతో భయం భయంగా బతుకీడుస్తున్నారు. ముప్పై ఏళ్ల క్రితం 1995 జనవరిలో ఎగసిన పాసర్లపూడి బ్లోఅవుట్‌ను అదుపు చేయడానికి 65 రోజులు పట్టింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రెండవ బ్లోఅవుట్. ఆరు వేల కుటుంబాలు సహాయ శిబిరాలలో తలదాచుకోవాల్సి వచ్చింది. పంట నష్టం, పర్యావరణ నష్టం అపారం. అంతకుముందు 1993లో కొమరాడలో 28 రోజులు, 1997లో దేవరపల్లిలో రెండు రోజులు, 2020లో ఉప్పూడిలో మూడు రోజులు బ్లోఅవుట్‌లు కొనసాగాయి. ఉప్పూడి విస్ఫోటనానికి కోల్‌కతాకు చెందిన పిఎఫ్‌హెచ్ అనే ప్రైవేటు సంస్థ డ్రిల్లింగ్ కారణమని తేల్చారు. 2014 జూన్ 27న మామిడికుదురు మండలం నగరంలో గెయిల్‌కు చెందిన మెయిన్ పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీకై 22 మంది చనిపోయారు. కాలం చెల్లిన పైప్‌లైన్లు, పరికరాలు, నిర్వహణాలోపం, ప్రైవేటు దోపిడీ వలన తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి పడటం కాకుండా శాశ్వత భద్రతా చర్యలు చేపట్టడం ఉత్తమం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, ఒఎన్‌జిసి, ఇత్యాది వ్యవస్థలు ఆ పని చేసి ప్రజలకు ప్రమాదాల భయాల నుంచి విముక్తి కల్పించాలి. 1995లో చెలరేగిన పాశర్లపూడి బ్లో అవుట్ మరిచిపోలేని చేదు జ్ఞాపకంగా నిలిచి పోయింది. దాని గురించి ఇప్పుడు ప్రస్తావనకు వచ్చినా కోనసీమ వాసులు ఉలిక్కిపడుతుంటారు. ఈ ఘటన జరిగి 26ఏళ్లు పూర్తయ్యాయి. ఈ తరానికి ఆనాటి ఘటన తెలియకపోవచ్చు. సాంకేతికత పెద్దగా అందుబాటులో లేని ఆ సమయంలో దానిని ఆర్పేందుకు నానా యాతన పడ్డారు. ఇప్పుడు మరో మ్లో ఔట్ కడా ఆర్పడానికి వారమైనా చల్లారలేదు. అది1995 సంవత్సరం.. జనవరి నెల.. 8 తారీఖు. ఆకుపచ్చటి దుప్పటి పరుచుకున్నట్లు కనిపించే తూర్పుగోదావరి జిల్లా కోనసీమలోని మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామం అది. ప్రజలంతా ఉదయాన్నే నిద్రలేచి ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉన్నారు. అంతే ఒక్కసారిగా సంభవించిన భారీ శబ్దంతో అందరూ ఉలిక్కిపడ్డారు. ఆ శబ్దం ఏంటా అనే తేరుకునేలోగానే ఆకాశాన్ని తాకుతున్నట్లుగా ఓ మంట పైకెగసింది. వెంటనే సైరన్ మోగడంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భయంతో వణికిపోయారు. చమురు అన్వేషణలో భాగంగా పాశర్లపూడి 19సెక్టార్ వద్ద ఓఎన్‌జీసీ సంస్థ జరుపుతున్న డ్రిల్లింగ్ పనుల్లో జరిగిన పొరపాటు వల్ల గ్యాస్ బయటికి లీకై మంటలు అంటుకున్నాయి. అంత మంట తాకిడికి సమీపంలోని కొబ్బరిచెట్లన్నీ క్షణాల్లోనే మాడి మసైపోయాయి. అప్పటివరకు చిన్న గ్యాస్ లీకులే చూసిన కోనసీమ ప్రజలు ఈ భయానక దృశ్యాన్ని చూసి అల్లాడిపోయారు. బ్లో అవుట్ నుంచి వచ్చే వేడి వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లోని చెట్లన్నీ క్రమంగా చనిపోయి మోడులుగా మిగిలాయి. రాత్రివేళ్లలో కొన్ని కిలోమీటర్ల వరకు పరిధి వరకు ఈ మంట కనిపించేది. ఈ బ్లో అవుట్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్లో అవుట్‌గా రికార్డులకెక్కింది. ఆనాడు దేశంలోనే ఎందరో నిపుణులు బ్లో అవుట్‌ను ఆర్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఎన్నో ప్రయత్నాల తర్వాత విదేశాలకు చెందిన కొందరు నిపుణులు సహకారంతో 65 రోజుల తర్వాత బ్లో అవుట్‌ను ఆర్పగలిగారు. జనవరి 8న సంభవించిన ఈ బ్లో అవుట్ మార్చి 15న అదుపులోకి రావడంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు గోదావరి జిల్లా వాసులతో పాటు ఇతర జిల్లాలు, వేరే రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు తండోపతండాలు తరలివచ్చేశారు. దీంతో రెండు నెలల పాటు పాశర్లపూడి పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతూనే ఉంది.

తాజాగా కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇసుమండలో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ బావిలో సోమవారం సంభవించిన బ్లోఅవుట్ కోనసీమ వాసులతోపాటు యావత్ రాష్ట్రాన్ని కలవరపాటుకు గురి చేసింది. ప్రాణనష్టం లేకపోవడం పెద్ద ఊరట అయినా ఆర్పడం మా÷-తరం సవాల్‌గా మారింది. బ్లోఅవుట్ ఉధృతి తగ్గినప్పటికీ మూడు రోజులైనా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. మంటలను అరికట్టేందుకు చర్యలు చేపట్టిన ఒఎన్‌జిసి అధికారులు, పూర్తిగా అదుపుకావడానికి మరికొన్ని రోజులు పడుతుందని చెబుతున్నారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చినా ఇది మాత్రం అందకుండా పోతోంది. గ్యాస్, క్రూడ్ ఆయిల్ 30 మీటర్ల ఎత్తుకు ఉబికొచ్చి భారీ పేలుడు సంభవించి మంటలు వ్యాపించాయి. ప్రస్తుతం 10-15 మీటర్ల ఎత్తు వరకు మంటలు ఎగసిపడుతున్నాయి. అందువల్ల పూర్తిగా పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు కోనసీమ వాసుల కంటిపై నిద్ర ఉ ండదు. బ్లోఅవుట్ భయానికి మూడు గ్రామాల ప్రజలు బతుకుజీవుడా అని సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. విస్ఫోటనం ధాటికి వందలాది కొబ్బరి చెట్లు, వరి నారుమళ్లు, ఇతర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. బాధితులకు సముచిత స్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలి. ఒఎన్‌జిసి 2,600 మీటర్ల లోతు వరకు ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను వెలికి తీస్తుంది. తాజాగా ప్రమాదం జరిగిన మోరీ బావి-5ను ఒఎన్‌జిసి 1993లో డ్రిల్లింగ్ చేసింది. ఈ బావిలో పీడనం అధికంగా ఉండటం వలన మరింత లోతుకు తవ్వకాలు ప్రమాదకరమని భావించి నిలిపేసింది. తిరిగి 2024లో ప్రెజర్ తక్కువుందని చెప్పి గుజరాత్‌కు చెందిన డీప్ అనే ప్రైవేటు సంస్థకు డ్రిల్లింగ్ నిమిత్తం ఒఎన్‌జిసి కాంట్రాక్టుకు ఇచ్చింది. విస్ఫోటనం జరిగిన రోజున 2,600 మీటర్ల లోతులో ఒక లేయర్‌లో ఎక్స్‌ప్లరేషన్‌కు ప్రయత్నించారు. ప్రజల మాన ప్రాణాలు కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సైతం ప్రమాదానికి అసలు కారణాలపై ఇప్పటి వరకు తెలుసుకోలేక పోయారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిగితేనే నిజాలు బయట పడతాయి. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా నివారించడానికి ఆస్కారం ఉంటుంది.

# ఇరాన్‌లో ముదురుతున్న అల్లర్లు

- కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరిక
- ఆందోళనకారులను దేశ శత్రువులుగా పరిగణిస్తామని ప్రకటన
- ఇప్పటికే 72 మంది మృతి.. 2300 మంది అరెస్ట్
- దేశవ్యాప్తంగా ఇంటర్నెట్, ఫోన్ సేవలు నిలిపివేత
- నిరసనకారులకు అండగా ఉంటామన్న అమెరికా



**టెహ్రాన్, జనవరి 10:** ఇరాన్‌లో దాదాపు రెండు వారాలుగా కొనసాగుతున్న నిరసనలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. వీటిపై ఉక్కుపాదం మోపుతున్న అక్కడి ప్రభుత్వం ఆందోళనలు విరమించకపోతే తీవ్ర చర్యలు తప్పవని మరోసారి హెచ్చరించింది. ఆందోళనల్లో పాల్గొనేవారిని దేశ శత్రువులుగా పరిగణిస్తామని, వారికి మరణశిక్ష అభియోగాలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించినట్లు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది. దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను ఇరాన్ ప్రభుత్వం ఇటీవల నిలిపివేసింది. దీంతో అక్కడ ఏం జరుగుతుందనే విషయం బాహ్య ప్రపంచానికి తెలియడం కష్టంగా మారింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల్లో ఇప్పటికే 72 మంది ప్రాణాలు కోల్పోగా, 2300 మందిని భద్రతా సిబ్బంది కస్టడీలోకి తీసుకున్నట్లు అమెరికా కేంద్రంగా నడిచే మానవ హక్కుల సంఘాలు పేర్కొన్నాయి. అయితే వాస్తవంగా మృతుల సంఖ్య 200లకు పైగా ఉండవచ్చని పలు అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఇరాన్ పౌరులకు అండగా ఉంటామని చెబుతున్న అమెరికా నిరసనకారులపై హింసకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని ఆ దేశ సుప్రీం లీడర్‌ను హెచ్చరించింది. అధ్యక్షుడు ట్రంప్‌తో ఆటలాడొద్దని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి ఘాటుగా స్పందించారు. మరోవైపు ఇరాన్ సుప్రీం లీడర్ మాత్రం ఆందోళనకారులపై అణచివేత కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశద్రోహానికి పాల్పడేవారు, అభద్రతను సృష్టించేవారు, విదేశీ ఆధిపత్యాన్ని కోరుకునేవారిపై కఠినమైన అభియోగాలు నమోదు చేస్తామని ఇరాన్ అటార్నీ జనరల్ వెల్లడించారు. వారికి కఠిన శిక్ష తప్పదని, ఈ విషయంలో ఎటువంటి దయ చూపించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

## బంగ్లాలో ఆగని దాడులు

దుండగుల దాడిలో మరో హిందువు హత్య



**ఢాకా,జనవరి10:** కొంత కాలంగా బంగ్లాదేశ్ లో మైనారిటీలపై జరుగుతున్న దాడుల్లో భాగంగా మరో హిందువు కన్నుమూశాడు. సునమ్‌గంజ్ జిల్లాలో ఓ అల్లరి మూక చేతుల్లో జై మహాపాత్రో అనే హిందువు ప్రాణాలు కోల్పోయాడు. ఈ హత్యోదంతం తీవ్ర కలకలం రేపుతోంది. మీడియా కథనాల ప్రకారం.. సునమ్‌గంజ్ జిల్లాలో జరిగిన భంగాడోహోర్ గ్రామంలో ఆర్థిక లావాదేవీల అంశాన్ని ఆధారంగా చేసుకొని గురువారం 19 ఏళ్ల జై మహాపాత్రపై అమీరుల్ ఇస్లాం అనే వ్యక్తితోపాటు మరికొంత మంది దాడి చేశారు. ఈ దాడిలో మహాపాత్రో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. హత్య వార్త తెలియగానే స్థానిక హిందూ సమాజం, మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి. ఢాకాలోని పలు ప్రాంతాల్లో శనివారం నిరసన ప్రదర్శనలు జరిగాయి. 'జై మహాపాత్రోకు న్యాయం' కావాలంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్య అనంతరం దేశంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. 35 రోజుల్లో 11 మంది హిందువుల చనిపోయినట్లు సమాచారం.

## ఇరాన్ సంక్షోభంతో ఎగుమతులపై ప్రభావం

భారత్ నుంచి నిలిచిపోయిన బాస్మతి రవాణా


**న్యూఢిల్లీ,జనవరి 10:** ఇరాన్ లో నెలకొన్న సంక్షోభం భారత బియ్యం ఎగుమతులపై పడింది. ప్రస్తుతం ఇరాన్ అంతర్యుద్ధంతో ఉడుకుతున్న సంగతి తెలిసిందే. ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక పరిస్తితి మందగించింది. మరోవైపు అమెరికా హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ కరెన్సీ విలువ దారుణంగా పడిపోయింది. దీంతో విదేశీ ఆహారోత్పత్తుల దిగుమతులపై ఇస్తున్న సబ్సిడీని ఇరాన్ ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో ఇండియా నుంచి ఇరాన్ కు ప్రీమియం బాస్మతి బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి. ఇరాన్ కు ఎగుమతి చేయాల్సిన బాస్మతి బియ్యం భారత గోడౌన్లలోనే నిలిచిపోయింది. దాదాపు రూ. 2,000 కోట్ల విలువైన బియ్యం ఎగుమతులు నిలిచిపోయినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయంలో ఇరాన్ నుంచి స్పష్టమైన హామీ ఇస్తేనే బియ్యం ఎగుమతులు సాధ్యమవుతాయి. ఇండియాలో పండే ప్రీమియం బాస్మతి బియ్యం ఎక్కువగా ఇరాన్ కు ఎగుమతి అవుతుంది. పంజాబ్, హరియాణా రాష్ట్రాలు అత్యధికంగా బాస్మతి బియ్యం పండిస్తున్నాయి. ఇటీవలి కాలంలో డాలర్ తో పోలిస్తే ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ అత్యల్ప స్థాయికి పడిపోయింది. దీంతో అక్కడి ప్రభుత్వం ఆహార పదార్థాల దిగుమతులకు ఇస్తున్న సబ్సిడీని ఎత్తివేసింది. ఇదే సమయంలో ఇండియా.. ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించింది. అయితే, ఇరాన్ మాత్రం ఇండియా నుంచి మెడిసిన్స్, టీ పౌడర్, బాస్మతి రైస్ వంటివి దిగుమతి చేసుకుంటూనే ఉంది. ఇండియా నుంచి అత్యధికంగా బాస్మతి రైస్ దిగుమతి చేసుకునే దేశం ఇండియానే. ప్రతి ఏటా 12 లక్షల టన్నులు.. అంటే.. రూ. 12,000 కోట్ల విలువైన బియ్యాన్ని ఇరాన్ దిగుమతి చేసుకుంటుంది. కానీ, తాజా పరిస్తితుల నేపథ్యంలో కొద్ది రోజులుగా ఇండియా నుంచి ఎగుమతులు ఆగిపోయాయి.



# ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానం

- చరిత్ర పాఠాల నుంచి ప్రేరణ పొందాలి
- మన స్వాతంత్ర్య యోధుల ధీరత్వం పుణికి పుచ్చుకోవాలి
- వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో అజిత్ ధోవల్

**న్యూఢిల్లీ,జనవరి 10:** మన దేశ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని యువతకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దబోల్ సూచించారు. ప్రతీకారం మంచిది కాదని.. దానిని ప్రేరణ శక్తిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం మన సరిహద్దుల వద్దే కాకుండా.. దేశంపై గతంలో జరిగిన అణచివేతకు ప్రతీకారం తీర్చుకోవాలని అన్నారు. ఇందుకోసం దేశ సైనిక, ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల ధీరత్వాన్ని పుణికి పుచ్చుకోవాలన్నారు. చరిత్రలో ఇతర దేశాలు మనపై దాడులు చేసి ఆలయాలు, గ్రామాలను ధ్వంసం చేసినప్పటికీ మన పూర్వీకులు మాత్రం ఏ దేశ ప్రజలకూ ఎటువంటి హాని చేయలేదని అజిత్ డోభాల్ పేర్కొన్నారు. వారి నుంచి పాఠాలు నేర్చుకొని మనం కూడా ఇతరులను ఇబ్బందిపెట్టకుండా ప్రగతిశీల సమాజం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఏ దేశమైనా అభివృద్ధి బాటలో నడవాలంటే సరైన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ఢిల్లీలో శనివారంనాడు జరిగిన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమంలో యువతను ఉద్దేశించి అజిత్ డోభాల్ మాట్లాడారు. నాయకత్వం గొప్పదనాన్ని తెలుపుతూ.. 'ఒక గొర్రె నేతృత్వంలోని వెయ్యి సింహాలకు భయపడను.. కానీ సింహం నేతృత్వంలోని వెయ్యి గొర్రెలకు భయపడతాను' అని ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ అన్న మాటలను గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కేవలం పదేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు నడిపిందన్నారు. మరికొన్నేళ్లలో భారత్ అభివృద్ధి చెందిన దేశాల వరుసలో నిలుస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం వంటి విషయాల్లో ప్రధాని మోదీ నిబద్ధత, కృషి, నాయకత్వ భావాలు, అంకితభావం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మీరు అదృష్టవంతులు, ఇండిపెండెంట్ ఇండియాలో మీరు పుట్టారు. భారతదేశం వలసవాదుల గుప్పిట్లో ఉన్నప్పుడు నేను పుట్టాను' అని 81 ఏళ్ల డోభాల్ అన్నారు. దేశవ్యాప్తంగా 3,000 మంది యువ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భగత్‌సింగ్‌ను ఉరి తీశారని, సుభాష్ చంద్రబోస్ తన జీవితాంతం కష్టపడ్డారని, స్వాతంత్ర్య సముపార్జన కోసం మహాత్మాగాంధీ సత్యాగ్రహం చేశారని డోభాల్ అన్నారు. ప్రపంచంలో జరిగిన దాడులు, యుద్ధాలకు కొన్ని దేశాలు తమ ఇష్టారీతిగా బలప్రయోగానికి దిగడమే కారణమని అన్నారు. 'మీరు శక్తిమంతులైతేనే స్వేచ్ఛగా మనగలుగుతారు. ఆత్మవిశ్వాసం లేకుండా ఎంత శక్తి ఉన్నా, ఆయుధ సంపత్తి ఉన్నా వృథా. అలాంటి గొప్ప నాయకులు మనకు ఉండటం మనం చేసుకున్న అదృష్టం' అని డోభాల్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. ఆయన పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణ మన అందరికీ స్ఫూర్తి అని డోభాల్ అన్నారు. నాయకత్వం గొప్పతనాన్ని వివరిస్తూ నెపోలియన్ అన్న మాటలను ఆయన గుర్తుచేశారు. ఒక గొర్రె నేతృత్వంలోని వెయ్యి సింహాలకు కూడా తాను భయపడనని, కానీ ఒక సింహం నాయకత్వంలోని వెయ్యి గొర్రెలకు భయపడతానని నెపోలియన్ చెప్పేవారని అన్నారు. మనది ప్రగతిశీల సమాజమని, మనం ఇతరుల నాగరికత, ఆలయాలపై దాడులు చేయమని అన్నారు. భారతదేశంపై గతంలో జరిగిన దాడులను ప్రస్తావిస్తూ, ఈ దాడుల్లో లెక్కకుమించి ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, వేలాది ఆలయాలు ధ్వంసమయ్యాయని, గ్రామాలను దోచుకున్నారనీ, మన నాగరికతను అణిచివేశారని అన్నారు. చరిత్ర మనకు సవాళ్లు విసురుతోందన్నారు. అయితే ఇందుకు తగిన ÷ర్ ఇవాల్టి యువతలో ఉందన్నారు. ప్రతీకారం అనేది మంచి పదం కానప్పటికీ, అది శక్తిమంతమైనదని అన్నారు. దేశం కోసం మనం ప్రతీకారం తీర్చుకోవాలి, అందుకోసం విలువలతో కూడిన సమున్నత భారతదేశాన్ని పునర్నిర్మించుకోవాలని దిశానిర్దేశం చేశారు.



# మినీ గోకులం షెడ్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**నేటి సాక్షి తిరుపతి,పాకాల:** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీ పెరుమాళ్ళగుడి పల్లిలో మినీ గోకులం షెడ్, శిలాఫలకాన్ని శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పీడీ, ఎంపీడీఓ వాసుదేవరావు,తాసిల్దార్ సంతోష్ సాయి, ఏపీఓ ఆషారాణి, డిప్యూటీ ఎంపీడీఓ శశిరేఖ, వివిధ శాఖల అధికారులు, స్థానిక రైతులు, నాయకుల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నాని'కి పూర్ణ కుంభస్వాగతం అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, మహిళలు పలికారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ రాష్ట్రంలోని పాడి రైతులకు కూటమి ప్రభుత్వ రాకతో అన్ని రకాల సౌకర్యాలు చేకూరుస్తుందని చెప్పారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో రాష్ట్రంలోని పాడి రైతులకు కావలసిన సదుపాయాల కల్పనలో శ్రద్ధ తీసుకుంటుందని,అందులో భాగంగా పాకాల మండలం పరిధిలోని పదిపుట్లబైలు పంచాయతీ పదిపుట్లబైలు గ్రామంలో మినీ గోకులం షెడ్ ప్రారంభోత్సవం చేపట్టామని అన్నారు.చంద్రగిరి నియోజకవర్గం లోని పాడి రైతులకు మినీ గోకులాలు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెమ నాయుడును కోరమని చెప్పారు.సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి,పశు సంవర్ధక శాఖ మంత్రి పాకాల మండలంలో 267 మినీ గోకుకాలను సుమారు 7 కోట్ల 72లక్షల రూపాయలను మంజూరు కూటమి ప్రభుత్వం చేసింది అని తెలియజేశారు.గడిచిన 5 సంవత్సరాలలో గత పాలకులు స్వార్థ ప్రయోజనాల,నిర్లక్ష్య వైఖరితో రైతులను,రైతాంగాన్ని గాలికి వదిలేశారన్నారు.ఎలక్షన్ సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా వర్షాకాలంలో పాడి రైతులు పడుతున్న ఇబ్బందులు,కష్టాలను దృష్టిలో ఉంచుకొని చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలానికి వి బి జి రాంజీ పథకం ద్వారా 267 గోకులాలకు సుమారు 7కోట్ల 72 లక్షల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు.మండలంలోని ప్రతి ఒక్క రైతు పాడిపరిశ్రమకు మెరుగుపరుస్తూ ప్రభుత్వం నుండి కావాల్సిన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపిపారు.రైతులను లాభసాటిగా చేయడంతో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని పండించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని తెలిపారు. పాడి పరిశ్రమను ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# చేతబడి నెపంతో వృద్ధురాలిపై అమానుషం.





- రూ.2 కోట్ల ఆస్తి మింగి వృద్ధురాలిపై చిత్రహింసలు
- కోడలు-మనవడి కిరాతకం: 9 నెలల నరకం
- ఇంటి గదే జైలు వృద్ధురాలిపై అమానుష ప్రవర్తన
- పింఛన్ డబ్బులపై కన్నూ కోదాడలో కలకలం

**నేటి సాక్షి కోదాడ ప్రతినిధి:** చేతబడి చేసిందన్న అనుమానంతో ఓ వృద్ధురాలిని ఆమె కుటుంబ సభ్యులే తొమ్మిది నెలల పాటు గదిలో బంధించి అమానుషంగా హింసించిన దారుణ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో వెలుగుచూసింది. కోదాడ పట్టణంలోని శిరిడీ సాయి నగర్‌లో శనివారం ఈ ఘటన బయటపడటంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. బాధితురాలు అన్నపూర్ణ (వృద్ధురాలు) కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తెలిపిన వివరాల ప్రకారరౌ తన కోడలు, మనవడు కలిసి చేతబడి పేరుతో తనను ఇంట్లోని ఒక గదిలో బంధించి బయటకు రానివ్వకుండా చిత్రహింసలు పెట్టారని ఆరోపించింది. మానసికంగా, శారీరకంగా తీవ్రంగా వేధించారని వాపోయింది. గుంటూరు జిల్లా సత్తెనపల్లి ప్రాంతంలో ఉన్న తన ఆస్తిని సుమారు రూ.2 కోట్లకు విక్రయించి, ఆ మొత్తాన్ని తన కుమారుడు శ్రీనివాస్ రెడ్డికి ఇచ్చినట్లు తెలిపింది. అంతేకాకుండా తాను పొందుతున్న నెలకు రూ.38 వేల పింఛన్ మొత్తాన్ని కూడా మనవడే దోచుకుంటున్నాడని ఆరోపించింది. ఇటీవల ఇంటి కిటికీ ద్వారా వృద్ధురాలిని దయనీయ స్థితిలో చూసిన స్థానికులకు అనుమానం వచ్చి ఇంటికి వెళ్లగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వృద్ధురాలిని బయటకు తీసుకెళ్లే ప్రయత్నం చేయగా కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తక్షణమే స్పందించిన స్థానికులు వృద్ధురాలిని రక్షించి కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. అనంతరం ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధ్యులైన కుటుంబ సభ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. వృద్ధులపై జరుగుతున్న వేధింపులకు ఇది మరో దారుణ ఉదాహరణగా మారగా, ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

# ప్రతి ఒక్కరిని క్రీడల్లో రాణించాలి..





- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

**నేటి సాక్షి పాములపాడు:** ఈరోజు పాములపాడులోనీ, జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని, గ్రామ ప్రజల సహకారంతో, గ్రామ యూత్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ మొదటి రోజు కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నందికొట్కూరు నియోజవర్గం మాజీ శాసనసభ్యులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పీటిసి తరిగోపుల నాగేశ్వరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కురువ.ఎల్లయ్య,ఎస్సై- పి.తిరుపాలు హాజరయ్యారు.మొదటి బహుమతికి స్పాన్సర్లుగా జిల్లా బిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ & తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కురువ రమేష్,వివేకానంద విద్యా విహార్ హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్.ఎస్.ఆర్.గోపాల్, మమతా క్లినిక్ డాక్టర్ ఎం.రాజు పాల్గొన్నారు. రెండో బహుమతికి స్పాన్సర్లుగా ఎస్వీఎల్ రంజిత్, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ కురువ నాగరాజు,మూడో బహుమతికి స్పాన్సర్లుగా టైలర్ లింగారెడ్డి, డిష్ రామచంద్ర వ్యవహరించారు. ఈ సందర్భంగా నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి బ్రాహ్మణకోట్కూరు వర్సెస్ లింగాల మధ్య జరిగిన ఇనాగ్రేషన్ మ్యాచ్‌కు రిబ్బన్ కటింగ్ చేసి, క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి, క్రికెట్ పోటీలను అధికారికంగా ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులుకురువ వెంకటేశ్వర్లు, మిట్టకందాల గ్రామ సర్పంచ్ చింతల నారాయణ, వీరారెడ్డి, వెంకటస్వామి, తిమ్మయ్య, బాలస్వామి, యోహాన్, లోకేశ్వర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, బాలీశ్వర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, రామ సుబ్బయ్య,పి.హుసేన్ భాష, రిటైర్డ్ గవర్నమెంట్ టీచర్ జాల కృష్ణుడు, చెలిమిళ్ళ డేగల.లోకేశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు. టీడీపీ పార్టీ యువ నాయకులు లింగాల నవీన్ కుమార్ గౌడ్.. తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మొదటి రోజు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మున్సిపల్ లో బీజేపీ జెండా ఎగరాలి...

బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు





**నేటి సాక్షి మెట్ పల్లి:** ప్రస్తుతం జరగబోయే మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో మెట్ పల్లి మున్సిపల్ పైన బీజేపీ జెండా ఎగరేయాలని, ఇందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ చిట్నేని రఘు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ అధ్యక్షతన మున్సిపల్ ఎన్నికల సన్నహాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ చిట్నేని రఘు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని బీజేపీ సొంతం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్క బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోబోతున్నామని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అరవింద్ గెలిచిన తర్వాత ఈ ప్రాంతంలో సుమారుగా 49 శాతానికి పైగా బీజేపీ ఓటు బ్యాంకు పెరగడం శుభ పరిణామం అన్నారు. గతంలో జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పెరిగిన బీజేపీ ఓటు బ్యాంకు ప్రస్తుత ఎన్నికల్లో కలిసి వచ్చే అంశమని పేర్కొన్నారు. వార్డుల్లో పార్టీ టికెట్ ఎవరికీ ఇచ్చినా అభ్యర్థిని గెలిపించుకోవడానికి సాయశక్తుల కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా కృషి చేస్తే ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించనుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మీ, జిల్లా కార్యదర్శి పీసు రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, పట్టణ ప్రధాన కార్యదర్శులు సుంకేట విజయ్, కుడుకల రఘు, అన్ని వార్డుల బీజేపీ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓబన్న జయంతిని జయప్రదం చేయండి

దేరంగుల జయకుమార్



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** స్వతంత్ర సమరయోధుడు బ్రిటిష్ వారి గుండెల్లో గుబులు పుట్టించిన ధీరుడు వడ్డే ఓబన్నగారి 219 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం రాష్ట్ర వేడుకగా ప్రకటించింది. బ్రిటీష్ సామ్రాజవధుల గుండెలలో సింహ స్వప్నమై నిలిచిన రేనాటి వీరుడు మన వడ్డెర జాతి ఆరాధ్యదైవం వడ్డే ఓభన్న జయంతి జరుపుకొనుటకు స్థలం రామసముద్రం చెక్పోస్ట్ కూడలి నందు జనవరి 11 నందు ఆదివారం ఉదయం 10 గంటలకు జయంతి సందర్భంగా కేక్ కటింగ్ జరుగును. కావున పుంగనూరు నియోజకవర్గ వడ్డెర కుల బంధువులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పుంగనూరు నియోజకవర్గ వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి దేరంగుల జయ కుమార్ కోరారు.

నేటి సాక్షి

కరీంనగర్

ఆదివారం
11 జనవరి 2026

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

**జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్**



**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్:** అంతర్రాష్ట్ర సరిహద్దు పోలీస్ స్టేషన్ల పరిధిలో పటిష్ట నిఘా ఏర్పాటు, అసాంఘిక కార్యకలాపాలైన పేకాట, కోడిపందాలు నిర్వహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీమతి నితిక పంత్ ఐపీఎస్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, నిరంతర వాహన తనిఖీలు మరియు గస్తీని ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పోలీస్ స్టేషన్ల పరిధిలో మరింత అప్రమత్తంగా ఉండాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. పట్టుబడిన నిందితులపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అన్ని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో లేదా డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

# సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జరభద్రం

**అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి**

**గొల్లపల్లి ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి**

**జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్**



**నేటి సాక్షి, గొల్లపల్లి:** మండలం ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి సంక్రాంతి పండుగ సందర్భంగా దొంగతనాలు నివారించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు సంక్రాంతి పండుగను ప్రజలు ఎంతో ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకుంటారు. ఈ సందర్భంగా చాలామంది తమ స్వగ్రామాలకు లేదా ఇతర గ్రామాలకు వెళ్లడం జరుగుతుంది. ఇళ్లు ఖాళీగా ఉండటంతో కొంతమంది దొంగలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు.ప్రజల ఆస్తి భద్రత దృష్ట్యా, పండుగకు వెళ్లే ముందు కింది జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి కోరారు ఇంటి తలుపులు కిటికీలు, వెంటిలేటర్లు అన్నీ బాగా తాళాలు వేసి ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలి.ఇంట్లో నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను ఉంచకుండా బ్యాంక్ లేదా లాకర్‌లో భద్రపరచాలి.నమ్మకమైన పొరుగువారు లేదా బంధువులకు మీ ప్రయాణ సమాచారం తెలియజేసి, ఇంటిని గమనించమని కోరాలి.రాత్రి సమయంలో ఇంట్లో లైట్లు లేదా వెలుతురు ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలి.సీసీటీవీ కెమెరాలు, అలారం వ్యవస్థలు ఉంటే అవి సక్రమంగా పనిచేస్తున్నాయో చూసుకోవాలి ఇంటి నుంచి వెళ్లిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయకూడదు ఇంట్లో పనిచేసే పనివాళ్ల వివరాలు సరిగా ధృవీకరించుకొని అవసరమైన సమాచారం మాత్రమే ఇవ్వాలి.ఎక్కువ రోజులు ఇంట్లో లేకపోతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం మంచిది. వెనుక తలుపులు, టెర్రస్ మార్గాలు వంటి ప్రదేశాలను ప్రత్యేకంగా పరిశీలించి తాళాలు వేయాలి. వాహనాలను సురక్షితమైన ప్రదేశాల్లో లేదా అధికారిక పార్కింగ్ ప్రాంతాల్లో ఉంచాలి. సంక్రాంతి పండుగను సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకునేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరం. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు

# కొత్త స్తంభాల లైన్ ఏర్పాటు చేసిన సర్పంచ్

**మేకల.భాగ్యమ్మ**



**నేటి సాక్షి పాములపాడు:** పాములపాడు గ్రామ సర్పంచ్ మేకల.భాగ్యమ్మ, ఆమె కుమారుడు మేకల.రాజశేఖర్ నేషనల్ హైవే ఎన్హెచ్ 340సి నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు వీది లైట్ల కోసం కొత్త విద్యుత్తు స్తంభాల లైన్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేకల భాగ్యమ్మ, ఆమె కుమారుడు మేకల రాజశేఖర్ మాట్లాడుతూ ఈ నూతన లైన్ వలన తహసిల్దార్ కార్యాలయానికి, వెలుగు కార్యాలయానికి, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, గ్రామ సచివాలయానికి, హౌసింగ్ ఏఈ కార్యాలయానికి, భారత్ గ్యాస్ గోడౌన్ కు, తదితర అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, భవిష్యత్తులో ప్రజలకు అన్ని వసతులకు పనిచేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, విద్యుత్తు సిబ్బంది, తదితర వర్కర్లు పాల్గొనడం జరిగింది.

# కథలాపూర్‌కి నిధుల వరద

- **గిరిజన తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.7.80 కోట్లు మంజూరు**



**నేటి సాక్షి, (రాధారపు నర్సయ్య)** వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్ మండల పరిధిలో గిరిజన గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. మండలంలోని పలు అన్‌కనెక్టెడ్ ఎస్టీ తండాలకు బీటీ రోడ్ల నిర్మాణం కోసం ట్రైబల్ వెల్ఫేర్ నిధుల నుంచి మొత్తం రూ.7 కోట్ల 80 లక్షలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**ఈ నిధులతో**

కథలాపూర్ మండలం ఇప్పపల్లి గ్రామంలో బీటీ రోడ్డునుంచి తండా వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు, భూషణ్రావుపేటలో కోనాపూర్ మెయిన్ రోడ్డునుంచి వాసం గుట్ట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి 20 లక్షలు, భూషణ్రావుపేట మెయిన్ రోడ్డులోని కచూరాల బాట నుంచి చింతకుంట రాజారాం తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్ల 60 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధుల మంజూరుతో గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడి, రవాణా సౌకర్యాలు మరింత సులభమవుతాయని స్థానిక గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రయత్నాలకు ఫలితం**

ఇటీవల కథలాపూర్ మండల పరిధిలోని గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాల్సిందిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్లను కోరారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే నిధులు విడుదల చేసింది.గిరిజన ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ తొలి ప్రాధాన్యతగా ఉందని, రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల విస్తరణకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. కథలాపూర్ మండలానికి ఇంత భారీగా నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**మరణించిన కుటుంబాలను పరామర్శించి ధైర్యం నింపిన ఆది శ్రీనివాస్**



మరోవైపు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. చింతకుంట గ్రామానికి చెందిన మురళి గల్ఫ్‌లో ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని కలిసి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే కథలాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు మామగారైన దయ్యనడిపి గంగారాం, కోనాపూర్ గ్రామానికి చెందిన రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి తల్లివారి కుటుంబాలను పరామర్శించి వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. బొమ్మెనా గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మురళి మరణంపై కూడా ఆయన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి. అజీమ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పుండ్రా నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్, మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు న్యావానంది శేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్టీ తండాల రహదారి అభివృద్ధి

- **నియోజకవర్గంకి రూ.11.30 కోట్ల మంజూరు**
- **రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**
- **గిరిజన గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు**
- **సీఎం, మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**నేటి సాక్షి. వేములవాడ (కొక్కుల వంశీ):** వేములవాడ నియోజకవర్గ పరిధిలోని గిరిజన తండాలు, గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ట్రైబల్ వెల్ఫేర్ నిధుల కింద రూ.11 కోట్ల 30 లక్షలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఇప్పటివరకు రహదారి సదుపాయం లేని అన్‌కనెక్టెడ్ ఎస్టీ తండాలకు బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇటీవల నియోజకవర్గంలోని పలు మండలాల్లో గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యాల అవసరాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ విషయమై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. దీనికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే నిధులను మంజూరు చేసింది.

**మంజూరైన పనుల వివరాలు**

**కథలాపూర్ మండలం:**

ఇప్పపల్లి గ్రామంలో బీటీ రోడ్డు నుంచి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి - రూ.3.00 కోట్లు భూషణ్ రావుపేట గ్రామం, కోనాపూర్ మెయిన్ రోడ్డు నుంచి వాసం గుట్ట వరకు - రూ.1.20 కోట్లు భూషణ్ రావుపేట మెయిన్ రోడ్డు కచూరాల బాట నుంచి చింతకుంట రాజారాం తండా వరకు - రూ.3.60 కోట్లు

**కోనరావుపేట మండలం:**

హనుమాన్ తండా నుంచి భూక్యా రెడ్డి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి - రూ.1.00 కోటి


**రుద్రంగి మండలం:**

రుద్రంగి నుంచి దసరా నాయక్ తండా వరకు సీసీ అప్రోచ్ రోడ్డు మరియు హై లెవల్ వంతెన నిర్మాణానికి - రూ.2.50 కోట్లు ఇదే విధంగా గతంలో కూడా వేములవాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరయ్యాయి. రుద్రంగి మండల కేంద్రంలోని కుక్కల గండి తండా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4.57 కోట్లు, కథలాపూర్ మండలంలోని కాలికోట మెయిన్ రోడ్డు నుంచి పోతారం లొంక రామన్న గుడి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5.30 కోట్లు మంజూరు చేశారు. ఈ రహదారుల నిర్మాణంతో గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఊరెళ్తున్నారా.. జరభద్రం..

- **బుగ్గారం ఎస్సై జి. సతీష్**

**నేటి సాక్షి, జగిత్యాల (గుండ ప్రశాంత్ గౌడ్):** బుగ్గారం మండలం ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి సంక్రాంతి పండుగ సందర్భంగా దొంగతనాలు నివారించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు సంక్రాంతి పండుగను ప్రజలు ఎంతో ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకుంటారు. ఈ సందర్భంగా చాలామంది తమ స్వగ్రామాలకు లేదా ఇతర గ్రామాలకు వెళ్లడం జరుగుతుంది. ఇళ్లు ఖాళీగా ఉండటంతో కొంతమంది దొంగలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు.ప్రజల ఆస్తి భద్రత దృష్ట్యా, పండుగకు వెళ్లే ముందు కింది జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై జి సతీష్ కోరారు ఇంటి తలుపులు కిటికీలు, వెంటిలేటర్లు అన్నీ బాగా తాళాలు వేసి ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలి.ఇంట్లో నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను ఉంచకుండా బ్యాంక్ లేదా లాకర్‌లో భద్రపరచాలి.నమ్మకమైన పొరుగువారు లేదా బంధువులకు మీ ప్రయాణ సమాచారం తెలియజేసి, ఇంటిని గమనించమని కోరాలి.రాత్రి సమయంలో ఇంట్లో లైట్లు లేదా వెలుతురు ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలి.సీసీటీవీ కెమెరాలు, అలారం వ్యవస్థలు ఉంటే అవి సక్రమంగా పనిచేస్తున్నాయో చూసుకోవాలి ఇంటి నుంచి వెళ్లిన విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయకూడదు ఇంట్లో పనిచేసే పనివాళ్ల వివరాలు సరిగా ధృవీకరించుకొని అవసరమైన సమాచారం మాత్రమే ఇవ్వాలి.ఎక్కువ రోజులు ఇంట్లో లేకపోతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం మంచిది. వెనుక తలుపులు, టెర్రస్ మార్గాలు వంటి ప్రదేశాలను ప్రత్యేకంగా పరిశీలించి తాళాలు వేయాలి. వాహనాలను సురక్షితమైన ప్రదేశాల్లో లేదా అధికారిక పార్కింగ్ ప్రాంతాల్లో ఉంచాలి. సంక్రాంతి పండుగను సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకునేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరం. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై జి. సతీష్ తెలిపారు





## చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యధిక పరుగులు బాదిన భారత క్రికెటర్‌గా నిలిచింది. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 20 పరుగులు చేసిన హర్మన్ ఈ రికార్డు సాధించింది. ఈ క్రమంలోనే యంగ్ బ్యాటర్ షఫాలీ వర్మను హర్మన్ అధిగమించింది.నవీ ముంబయి వేదికగా ముంబయి- ఆర్సీబీ మ్యాచ్‌తో ఈ ఎడిషన్ డబ్ల్యూపీఎల్ షురూ అయ్యింది. ఈ మ్యాచ్‌లో ముంబయి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఇందులో హర్మన్ దూకుడుగా ఆడే క్రమంలో 20 పరుగులకు పెవిలియన్ చేరింది. అయితే అంతకంటే ముందే 15 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద హర్మన్ ఈ ఘనత అందుకుంది. దీంతో హర్మన్ (871 పరుగులు) డబ్ల్యూపీఎల్‌లో అత్యధిక పరుగుల సాధించిన భారత క్రికెటర్‌గా నిలిచింది. ఆమె తర్వాత దిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ షఫాలీ వర్మ (865 పరుగులు) రెండో స్థానంలో కొనసాగుతోంది.కాగా, 2023లో డబ్ల్యూపీఎల్ ప్రారంభమైంది. ఇందులో హర్మన్ ఇప్పటిదాకా 28 మ్యాచ్‌ల్లో 39.59 సగటుతో 871 పరుగులు చేసింది. ఇందులో 8 హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. 95 పరుగులు అత్యధిక స్కోర్‌గా ఉంది. అటు షఫాలీ వర్మ 27 మ్యాచ్‌ల్లో 36 సగటుతో 865 పరుగులు చేసింది. ఇందులో ఆరు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే ఓవరాల్‌గా ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన లిస్ట్‌లో నాట్ సీవర్ టాప్‌లో ఉంది. ఆమె 30 మ్యాచ్‌ల్లో 1031 పరుగులు చేసింది. అలాగే ఈ టోర్నీలో ఇప్పటిదాకా 1000 రన్స్ మార్క్ అందుకున్న ఏకైక క్రికెటర్ కూడా నాట్ సీవరే. ఇదే మ్యాచ్‌లో ఆర్సీబీ బౌలర్ లారెన్ బెల్ కూడా అరుదైన ఘనత సాధించింది. బుల్లెట్‌లాంటి బంతులతో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టడంలో సక్సెస్ అయ్యింది. ఆమె నాలుగు ఓవర్ల స్పెల్‌లో 3.50 ఎకనామీతో 14 పరుగులే ఇచ్చి 1 వికెట్ తీసుకుంది. ఇందులో ఒక మెయిడెన్ కూడా ఉండడం విశేషం. అలాగే తన స్పెల్‌లో ఏకంగా 19 బంతులను డాట్ బాల్స్‌గా మలిచింది. ఈ క్రమంలోనే లారెల్ అద్భుత ఘతన అందుకుంది. మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక డాట్ బాల్స్ వేసిన రెండో బౌలర్‌గా నిలిచింది. అయితే ఈ రికార్డు షబ్నిమ్ ఇస్మాయిల్ పేరిట ఉంది. ముంబయి ఇండియన్స్ తరపున ఇస్మాయిల్ సింగిల్ ఇన్నింగ్స్‌లో 20 బంతులను డాట్ బాల్స్‌గా మలిచింది. ఇక మ్యాచ్‌విషయానికొస్తే, ఆర్సీబీ ఉత్కంఠ విజయం అందుకుంది. 155 పరుగుల లక్ష్యన్ని ఆర్సీబీ 7 వికెట్ల నష్టానికి ఓవర్లన్నీ (20) ఆడి అందుకుంది. ముఖ్యంగా ఆఖరి ఓవర్లో 18 పరుగులు చేయాల్సిన దశలో నదైన్ డి క్లెర్క్ (63లి పరుగులు) అద్భుతంగా పోరాడింది. తొలి రెండు బంతులు డాట్ ఆడినా, ఆ తర్వాత నాలుగు బంతులకు వరుసగా 6,4,6,4 బాది ఆర్సీబీకి అద్భుతమైన విజయం అందించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లలో 154-6 స్కోర్ చేసింది. సజీవన్ సజన (45 పరుగులు, 25 బంతుల్లో), నికొలే కేరీ (40 పరుగులు) రాణించారు.




## ఇండియాలో బంగ్లాదేశ్ ఆడాల్సిందే

వచ్చే నెలలో ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ 2026కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. అయితే బంగ్లాదేశ్ మాత్రం తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు తరలించాలని పట్టుబడుతోంది. ఈ వివాదం వెనుక అసలు కథ ఐపీఎల్ వేలంతో మొదలైంది. కోల్‌కతా నైట్ రైడర్స్ రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసిన బంగ్లా ఫాస్ట్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను వదిలేయాలని బీసీసీఐ ఆదేశించింది. పొరుగు దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, మైనారిటీలపై దాడుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు.ముస్తాఫిజుర్‌ను పంపేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బంగ్లాదేశ్, తమ ఆటగాళ్లకు భారత్‌లో రక్షణ ఉండదని ఆరోపిస్తూ ఐసీసీకి రెండు లేఖలు రాసింది. తమ మ్యాచ్‌లను శ్రీలంకలోని కొలంబోకు మార్చాలని కోరింది. అయితే బెంగళూరులో జరిగిన ఒక సమావేశం తర్వాత బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. బంగ్లాదేశ్ అభ్యర్థనలో పస లేదని తేల్చి చెప్పారు. ఐసీసీ కూడా బంగ్లాదేశ్‌కు స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. భారత్‌లో భద్రతా పరమైన ముప్పు ఏమీ లేదని, షెడ్యూల్ ప్రకారం కోల్‌కతా, ముంబైలలో ఆడాల్సిందేనని స్పష్టం చేసింది.బంగ్లాదేశ్ జట్టు కోల్‌కతాలో మూడు, ముంబైలో ఒక మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఒకవేళ భద్రత కారణాలు చెబుతూ భారత్‌కు రాకపోతే, ఆ మ్యాచ్ పాయింట్లను ప్రత్యర్థి జట్లకు కేటాయిస్తామని ఐసీసీ హెచ్చరించినట్లు సమాచారం. పాకిస్థాన్ కోసం అమలు చేసిన హైబ్రిడ్ మోడల్ తమకు కూడా వర్తింపజేయాలని బంగ్లాదేశ్ కోరినప్పటికీ, ఐసీసీ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. బీసీసీఐ ఇప్పటికే క్రీడాకారులకు అత్యున్నత స్థాయి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది.బంగ్లాదేశ్ క్రీడా శాఖ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ ఈ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. దేశ గౌరవాన్ని పణంగా పెట్టి భారత్‌లో ఆడబోమని ఆయన ప్రకటించారు. మరోవైపు బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారాలను కూడా నిషేధించారు. ఈ పరిణామాలు రెండు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఐసీసీ అధ్యక్షుడు జై షా నేతృత్వంలో ఈ సమస్య ఎలా పరిష్కారం అవుతుందో చూడాలి. ఫిబ్రవరి 7 నుంచి టోర్నీ మొదలుకానుండటంతో, బంగ్లాదేశ్ తన తుది నిర్ణయాన్ని ఈ వారంలోనే ప్రకటించే అవకాశం ఉంది.

# నేటినుండి భారత్ న్యూజిలాండ్
# వన్డే సిరీస్



టీ20 ప్రపంచ కప్ ప్రారంభానికి ముందు, భారత క్రికెట్ జట్టు న్యూజిలాండ్‌తో స్వదేశంలో తమ సన్నద్ధతను పరీక్షించుకోనుంది. రెండు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది, ఆ తర్వాత మ్యాచ్‌లు ఉంటాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లు ఉండటంతో ఈ సిరీస్ ప్రత్యేకంగా మారింది. విజయ్ హజారే ట్రోఫీలో అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించిన తర్వాత, ఈ స్టార్ ఆటగాళ్లు అంతర్జాతీయ వేదికపై కూడా తమ సత్తా చాటుతారని అభిమానులు ఆశిస్తున్నారు. భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే జనవరి 11, ఆదివారం నాడు జరగనుంది. ఈ మ్యాచ్ సిరీస్‌ను ప్రారంభిస్తుంది. రెండు జట్లు విజయంతో ప్రారంభించాలని చూస్తున్నాయి.భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి వన్డే జనవరి 11, ఆదివారం నాడు జరగనుంది. ఈ మ్యాచ్ సిరీస్‌ను ప్రారంభిస్తుంది. రెండు జట్లు విజయంతో ప్రారంభించాలని చూస్తున్నాయి. మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమవుతుంది. టాస్ అరగంట ముందు అంటే మధ్యాహ్నం 1:00 గంటలకు వేస్తారు.భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగే తొలి వన్డే మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్షంగా ప్రసారం చేస్తారు. అభిమానులు స్టార్ స్పోర్ట్స్ 1 ఛానెల్‌లో ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూడవచ్చు. భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన ఇటీవలి వన్డే మ్యాచ్‌ల గురించి మాట్లాడితే, టీమ్ ఇండియాదే పైచేయిగా ఉంది. గత ఐదు వన్డే మ్యాచ్‌లలో భారత్ అన్ని మ్యాచ్‌లను గెలిచింది, కొన్ని విజయాలు కూడా పెద్ద తేడాతో నమోదయ్యాయి. ఇది భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని ఖచ్చితంగా పెంచుతుంది.

### రెండు జట్ల స్క్వాడ్‌లు

భారత్ జట్టు ఇదే - శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్ (వైస్-కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ,



నితీష్ కుమార్ రెడ్డి, రిషబ్ పంత్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కెఎల్ రాహుల్, రోహిత్ శర్మ, వాషింగ్టన్ సుందర్.

న్యూజిలాండ్ టీం- మైఖేల్ బ్రాస్‌వెల్ (కెప్టెన్), ఆదిత్య అశోక్, జోష్ క్లార్క్సన్, డెవాన్ కాన్వే, జాక్ ఫౌల్క్స్, మిచెల్ హే, నిక్ కెల్లీ, డారిల్ మిచెల్, హెన్రీ నికోల్స్, జేడెన్ లెనోక్స్, గ్లెన్ ఫిలిప్స్, మైఖేల్ రే, విల్ యంగ్, కైల్ జేమీసన్, క్రిస్టియన్ క్లార్క్.

## కీలక రికార్డ్స్‌పై హిట్‌మ్యాన్ కన్ను



2025 ఏడాదిని ఘనంగా ముగించిన టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ కొత్త సంవత్సరంలో బరిలో దిగేందుకు రెడీ అయ్యాడు. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో హిట్‌మ్యాన్ ఆడనున్నాడు. జనవరి 11న వడోదర వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో రోహిత్ శర్మ తాజాగా వడోదరకు చేరుకున్నాడు. అయితే కొత్త ఏడాదిలో హిట్?మ్యాన్ పలు రికార్డులు అందుకునే ఛాన్స్ ఉంది. అందులో ఒకట్రెండు ఘనతలు ఈ సిరీస్?లోనే సాధించే అవకాశం ఉంది. రోహిత్ శర్మ ఇప్పటిదాకా 279 వన్డే మ్యాచ్?ల్లో 49.21 సగటుతో 11516 పరుగులు చేశాడు. మరో 484 రన్స్ చేస్తే వన్డేల్లో 12వేల పరుగుల క్లబ్‌లో చేరతాడు. దీంతో ఈ మైలురాయి అందుకున్న భారత మూడో క్రికెటర్‌గా రోహిత్ అరుదైన ఘనత ఖాతాలో వేసుకుంటాడు. భారత్ నుంచి ఇప్పటిదాకా దిగ్గజం సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ ఇద్దరే వన్డేల్లో ఈ మార్క్ అందుకున్నారు. ఓవరాల్‌గా ఏడో బ్యాటర్‌గా నిలుస్తాడు.అలాగే మరో 224 పరుగులు చేస్తే, పాకిస్థాన్ మాజీ క్రికెటర్ ఇంజమామ్ ఉల్ హక్ (11739 పరుగులు)ను అధిగమిస్తాడు. ఇంకో 63 పరుగులు చేస్తే సౌతాఫ్రికా దిగ్గజం జాక్ కలీస్ (11579 పరుగులు) ను దాటేస్తాడు. ఈ ఇద్దరినీ ఇదే సిరీస్?లో దాటేసే అవకాశం ఉంది.ఇంటర్నేషనల్ వన్డే కెరీర్‌లో హిట్‌మ్యాన్ ఇప్పటిదాకా 96సార్లు 50ం స్కోర్లు నమోదు చేశాడు. ఇందులో 33 సెంచరీలు, 61 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే మరో ఆరు 50ం స్కోర్లు నమోదు చేస్తే, వన్డే కెరీర్‌లో 100సార్లు 50ం స్కోర్లు చేసిన బ్యాటర్‌గా అరుదైన రికార్డు సాధిస్తాడు.వన్డే కెరీర్‌లో రోహిత్ శర్మ ఇప్పటిదాకా 355 సిక్స్?లు బాదాడు. ప్రస్తుతం వన్డేల్లో అత్యధిక సిక్స్?లు బాదిన బ్యాటర్‌గా రోహిత్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే మరో 45 సిక్స్?లు బాదితే వన్డేల్లో 400 సిక్స్‌ల మార్క్ అందుకున్న తొలి క్రికెటర్?గా నిలుస్తాడు. 18ఏళ్ల సుదీర్ఘ ఇంటర్నేషనల్ కెరీర్‌లో రోహిత్ ఇప్పటిదాకా మూడు ఫార్మాట్లలో కలిపి 50 శతకాలు నమోదు చేశాడు. మరో ఈ లిస్ట్‌లో పదో స్థానంలో ఉన్నాడు. క్రికెట్‌లో దిగ్గజాలు బ్రియన్ లారా (53), మహేల జయవర్ధనే (54), హాషీమ్ ఆమ్లా (55)కు మరో 5 సెంచరీల దూరంలో ఉన్నాడు. ఈ ఏడాది ఇంకో 6 శతకాలు బాదితే వీళ్లను అధిగమించి ఏడో స్థానానికి దూసుకెళ్లే ఛాన్స్ ఉంది.

## గుజరాత్ జెయింట్స్ శుభారంభం



2026 మహిళల ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్ జెయింట్స్ శుభారంభం చేసింది. ఈ లీగ్?లో భాగంగా శనివారం నవీ ముంబయి వేదికగా యూపీ వారియర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 10 పరుగుల తేడాతో నెగ్గింది. 208 భారీ ఛేదనలో యూపీ ఓవర్లన్నీ ఆడి 8 వికెట్లకు 197 పరుగులకే పరిమితమైంది. లిచీఫీల్డ్ (78 పరుగులు) పోరాడింది. చివర్లో ఆశ శోభన (27 పరుగులు) మెరుపులు మెరిపించిన ఫలితం లేదు. గుజరాత్ బౌలర్లలో రేణుకా సింగ్ ఠాకూర్, సోఫీ డివైన్, వేర్?హమ్ తలో 2, గార్డ్?నర్, గైక్వాడ్ చెరో 1 వికెట్ పడగొట్టారు.తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. గుజరాత్ జెయింట్స్ బ్యాటర్లు ఆరంభం నుంచే యూపీ బౌలర్లపై విరుచుకుపడ్డారు. గుజరాత్ కెప్టెన్ ఆష్లే గార్డనర్ కేవలం 41 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 65 పరుగులు చేసి జట్టును ముందుండి నడిపించారు. అనుష్క శర్మ అరంగేట్రం మ్యాచ్‌లోనే 30 బంతుల్లో 7 ఫోర్లతో 44 పరుగులు చేసి ఆశ్చర్యపరిచారు. సోఫీ డివైన్ మెరుపు ఆరంభాన్నిస్తూ 20 బంతుల్లోనే 38 పరుగులు జోడించారు. చివరిలో జార్జియా వేర్‌హామ్ (27), భారతి ఫుల్‌మాలీ (14) వేగంగా ఆడటంతో గుజరాత్ 200 పరుగుల మార్కును దాటింది. యూపీ బౌలర్లలో సోఫీ ఎక్లెస్టోన్ 2.. శిఖా పాండే, డాటిన్ చెరో వికెట్ తీశారు.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన యూపీ వారియర్స్‌కు ఓపెనర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆశలు రేకెత్తించారు. లిచ్‌ఫీల్డ్ కేవలం 40 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో 78 పరుగులు చేసి పెవిలియన్ చేరారు. కెప్టెన్ మెగ్ లానింగ్ (30), శ్వేతా షెరావత్, ఆశా శోభన రాణించినప్పటికీ.. గుజరాత్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లక్ష్యనికి 11 పరుగుల దూరంలో నిలిచిపోయారు. గుజరాత్ బౌలర్లలో జార్జియా వేర్‌హామ్, సోఫీ డివైన్, రేణుకా సింగ్ ఠాకూర్ తలో రెండు వికెట్లు తీశారు.

## అనుష్క శర్మ విధ్వంసం..



మహిళా క్రికెట్ ప్రపంచంలో ఒక కొత్త స్టార్ ఉదయించింది. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ రెండో మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌తో జరిగిన పోరులో గుజరాత్ జెయింట్స్ యువ సంచలనం అనుష్క శర్మ తన బ్యాట్‌తో గర్జించింది. తొలి మ్యాచ్‌లోనే ఏమాత్రం బెదురు లేకుండా ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడిన ఈ 22 ఏళ్ల కుట్టి, స్టేడియాన్ని హోరెత్తించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న యూపీ వారియర్స్ నిర్ణయం తప్పని నిరూపిస్తూ, గుజరాత్ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. ముఖ్యంగా అనుష్క శర్మ ఇన్నింగ్స్ ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఈ ఆల్‌రౌండర్, మూడో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చి గ్రౌండ్ నలుమూలలా షాట్లు ఆడింది. కేవలం 30 బంతుల్లోనే 44 పరుగులు సాధించి డెబ్యూ మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకుంది. ఇందులో ఏకంగా 7 ఫోర్లు ఉన్నాయి. ఆమె స్ట్రైక్ రేట్ 146.66గా ఉండటం విశేషం. స్టార్ ప్లేయర్ యాష్ గార్డనర్‌తో కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 103 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, గుజరాత్ జట్టు స్కోరును 200 దాటించడంలో కీలక పాత్ర పోషించింది. అనుష్క మెరుపు ఇన్నింగ్స్ పుణ్యమా అని గుజరాత్ జెయింట్స్ నిర్ణీత ఓవర్లలో 207 పరుగుల భారీ స్కోరు సాధించింది. మెగా వేలంలో అనుష్క శర్మ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. చివరికి 45 లక్షల రూపాయలకు గుజరాత్ జెయింట్స్ ఆమెను సొంతం చేసుకుంది. తన బేస్ ప్రైస్ కంటే 4.5 రెట్లు ఎక్కువ ధర పలికిన అనుష్క, తనపై యాజమాన్యం పెట్టుకున్న నమ్మకాన్ని మొదటి మ్యాచ్‌లోనే నిలబెట్టుకుంది. అండర్-19 లెవల్ నుంచే తన ఆటతీరుతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈమె, ఇప్పుడు పెద్దల లీగ్‌లోనూ తన సత్తా చాటుతోంది. అనుష్క శర్మ కేవలం డబ్ల్యూపీఎల్‌లో మాత్రమే కాదు.. దేశవాళీ క్రికెట్‌లోనూ అదరగొడుతోంది. ఇటీవల జరిగిన సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ ట్రోఫీలో సెంట్రల్ జోన్ తరపున ఆడి 155 పరుగులు చేయడమే కాకుండా 7 వికెట్లు కూడా పడగొట్టింది. అలాగే సీనియర్ టీ20 ట్రోఫీలో మధ్యప్రదేశ్ తరపున 207 పరుగులు చేసి సెలెక్టర్ల దృష్టిలో పడింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించగల సామర్థ్యం ఉండటంతో ఆమె భారత మహిళా జట్టులోనూ త్వరలోనే చోటు దక్కించుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# ప్రజల జేబులు కొల్లగొట్టిన రాజాసాబ్

## తొలిరోజే 112 కోట్లు వసూళ్లు




రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో రూపొందిన హారర్ కామెడీ చిత్రం 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ సినిమా మొదటి రోజు వసూళ్లపై చిత్రబృందం తాజాగా స్పందించింది. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. దీంతో ఈ సినిమా తొలి రోజున ప్రపంచవ్యాప్తంగా రూ. 112 కోట్ల మార్కును దాటేసి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. బాహుబలి 2, సాహో, ఆదిపురుష్, సలార్, మరియు కల్కి చిత్రాల తర్వాత ప్రభాస్ ఖాతాలో చేరిన ఆరో రూ. 100 కోట్ల ఓపెనర్ ఇది. దీంతో ఇండియాలో ఈ ఘనత సాధించిన ఏకైక హీరోగా ప్రభాస్ చరిత్ర సృష్టించారు. తెలుగు రాష్ట్రాల్లో రూ. 58 కోట్ల వసూళ్లను సాధించగా.. కర్ణాటక / ఇతర రాష్ట్రాలలో రూ. 18 కోట్లు, ఓవర్సీస్‌లో రూ. 36 కోట్లు రాబట్టినట్లు సమాచారం.



## 12 వస్తోన్న మనశంకరవరప్రసాద్ గారు

### టిక్కెట్లు ధరల పెంపునకు సర్కార్ గ్రీన్ సిగ్నల్

'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో స్పెషల్ ప్రీమియర్‌తో పాటు, టికెట్ ధరలు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జనవరి 11న స్పెషల్ ప్రీమియర్‌కు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య షోను ప్రదర్శించాల్సి ఉంటుంది. జనవరి 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశం కల్పించింది. ఈ విషయాన్ని తెలుపుతూ జీవో జారీ చేసింది. ఈ చిత్రం టికెట్ ధరలు పెంచుకునేందుకు ఇప్పటికే ఏపీలో గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అక్కడ స్పెషల్ ప్రీమియర్ షో టికెట్ ధర రూ.500 కాగా (జీఎస్టీతో కలిపి).. సింగిల్ స్క్రీన్‌లో రూ.100 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.125 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశాన్ని ఏపీ ప్రభుత్వం కల్పించింది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

## చీరకట్టులో సమంత సోయగాలు..

సమంత.. టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా భారీ పాపులారిటీ అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఇటీవల రెండవ వివాహం చేసుకొని కొత్త జీవితాన్ని మొదలుపెట్టింది. గత ఏడాది డిసెంబర్ 1న ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ఈషా యోగ ఫౌండేషన్ సమీపంలో ఉన్న లింగ భైరవి సన్నిధిలో ఏడు అడుగులు వేసింది. వివాహం అనంతరం సినిమాలపై ఫోటోస్ పెట్టింది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే ఈమె తెలుగులో నటిస్తున్న చిత్రం మా ఇంటి బంగారం. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ పై సహ నిర్మాతగా వ్యవహరిస్తూ ఉండగా.. ఈ చిత్రానికి సమంత భర్త రాజ్ నిడిమోరు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సమంతతో ఇదివరకే ఓ బేబీ సినిమా చేసిన డైరెక్టర్ నందిని రెడ్డి మరోసారి మా ఇంటి బంగారం అనే సినిమాకు దర్శకత్వం వహిస్తోంది. ఇక భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి జనవరి 9వ తేదీన ఈ సినిమా నుంచి టీజర్ ట్రైలర్ ను విడుదల చేశారు. ఇందులో సమంత ఒకవైపు కోడలిగా అత్తవారి మెప్పు పొందడానికి ప్రయత్నం చేస్తూనే.. మరొకవైపు యాక్షన్ పర్ఫామెన్స్ తో ఆకట్టుకుంది. ఈ టీజర్ ట్రైలర్ లాంచ్ లో భాగంగా థియేటర్లో సందడి చేసిన ఈమె తాజాగా అందుకు సంబంధించిన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. తెలుపు రంగు చీరకు గులాబీ వర్ణం కలిగిన బ్లౌజ్ ధరించి తన అందంతో మరింత ఆకట్టుకుంది. సింపుల్ జువెలరీతో తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసిన ఈమె మరింత సింపుల్గా అభిమానుల హృదయాలను దోచుకుంది. సమంతాను చాలా రోజుల తర్వాత ఇలా సంతోషంగా ఉండడం చూసి మనసుకు హాయిగా ఉంది అంటూ అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా సమంత మోములో స్వచ్ఛత అభిమానులనే కాదు నెటిజన్లను కూడా ఆకర్షిస్తోంది. ప్రస్తుతం సమంత షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.



## అందమైన ఆషీకా రంగనాధ్ అంత బోల్డ్ గానా?

దక్షిణాది హీరోయిన్లు అంటే బోల్డ్ పాత్రలకు అంత ఈజీగా కన్విన్స్ అవ్వరు. వీలైనంతవరకూ ఆ తరహా పాత్రలకు దూరంగా ఉండటానికే ప్రయత్నిస్తారు. దర్శకుడు తప్పదని పట్టుబడితే తప్ప అంగీకరించారు. అదీ పరిమితులకు లోబడే పని చేస్తామంటారు. అతిగా డిమాండ్ చేస్తే ప్రాజెక్ట్ ను వదులకోవడానికి వెనుకాడరు. ప్రత్యేకించి కన్నడ భామల్ని కన్విన్స్ చేయడం అంతకన్నా సులభం కాదు. కానీ ఓ నటి ఏరి కోరి మరి బోల్డ్ పాత్రను ఎంచుకుంది. పద్దతిగా చీర కట్టుకుని తెలుగు ఆడపడుచులా కనిపించే పాత్ర కావాలా? చిట్టిపొట్టి దుస్తుల్లో కుర్రాళ్లను కవ్వించే రోల్ కావాలా? అంటే చీర పాత్రలో ఏమంటుంది? రోటీనిటీ తప్ప కురచ దుస్తుల్లో అయితే వందశాతం న్యాయం చేస్తానంటూ ముందుకొచ్చిందో నటి. ఇంతకీ ఎవరా చిచ్చర పిడుగు అనుకుంటున్నారా? ఆమె ఎవరో కాదు బ్యూటీఫుల్ కన్నడ బ్యూటీ ఆషికా రంగనాధ్. నాగార్జున హీరోగా నటించిన 'నా సామిరంగ'లో జోడీగా మెప్పించిన అమ్మడికి ఆ తర్వాత హిట్ పడని సంగతి తెలిసిందే. చేసిన సినిమాలేవి కలిసి రాలేదు. ఈ క్రమంలో మాస్ రాజా రవితేజ హీరోగా కిషోర్ తిరుమల తెరకెక్కించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' లో ఛాన్స్ అందుకుంది. ఇందులో ఇద్దరు హీరోయిన్లు ఉండగా? ఓ హీరోయిన్గా ఆషికా రంగనాధ్ ఎంపికైంది. మరో హీరోయిన్ గా డింపుల్ హయతిని తీసుకున్నారు. ఈ కథ చెప్పడానికి వెళ్లినప్పుడు దర్శకుడు హీరో ప్రియురాలి పాత్ర బోల్డ్ గా ఉంటుంది? మరో పాత్ర అదే హీరోకు భార్యగా నటించాలి. రెండిటిలో ఏ పాత్ర తీసుకుంటారు? మీ ఇష్టంపైనే ఆధారపడి ఉందని ఛాన్స్ ఆషికా చేతుల్లోనే పెట్టాడు. అందుకు ఆషికా రంగన్నాద్ గత సినిమాల్లో చీర కట్టుకుని పద్దతిగా భార్యామణి పాత్రలు పోషించానని చెప్పి ఆ బోల్డ్ రోల్ లో నటిస్తానని ఓపెన్ గా చెప్పేసింది. సినిమాలో మానస శెట్టి అనే పాత్రలో కనిపించనుంది. స్పెయిన్ లో ఉన్న ఓ పెద్ద స్పిరిట్ కంపెనీ ఎండీ తను. స్ట్రాంగ్ బోల్డ్ గర్ల్ గా ఉంటుందా రోల్. ఈ తరం మోడ్రన్ గార్ల్ గా కనిపిస్తానంది. కెరీర్ లోనే ఇంత బోల్డ్ పాత్ర ఇప్పటి వరకూ పోషించలేదని తెలిపింది. ఈ సినిమా తన తర్వాత కొత్త ఇమేజ్ ఏర్పడుతుందని ఆషికా ధీమా వ్యక్తం చేసింది. మరో అమ్మాయికి భర్తగా ఉన్న వ్యక్తి జీవితంలోకి తానెళ్లిన తర్వాత జరిగిన పరిణామాలు ఏంటి? అన్నది ఓ పాయింట్ గా హైలైట్ అవుతుందని తెలిపింది. కిషోర్ తిరుమల క్లాసిక్ డైరెక్టర్ అయినా? సీన్ డిమాండ్ చేసిందంటే రాజీ పడే దర్శకుడు కాదు. బోల్డ్ సన్నివేశాన్ని రక్తికట్టించడంలోనూ అంతే సమర్థుడు. మరి కన్నడ బ్యూటీని ఏ రేంజ్ లో ఆవిష్కరిస్తున్నాడో చూడాలి.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంఎల్ఏ



**నేటి సాక్షి - జగిత్యాల(పూరెళ్ల బాపు):** జగిత్యాల పట్టణంలో 36, 42, 43 వార్డులలో 1 కోటి 30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు డ్రైనేజీ అభివృద్ధి పనులను పరిశీలించిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్. అనంతరం సంజయ్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా సీసీ రోడ్డు డ్రైనేజీ సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం కోసం పనులు చేపట్టామని,తెలంగాణ రాష్ట్రంలో జగిత్యాల నియోజకవర్గానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధిక నిధులు మంజూరు చేయటం జరిగింది అని అన్నారు. పట్టణంలో ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి 25 కోట్లతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి.4520 మంది నిరుపేదల కోసం డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేయటం జరిగింది.34 కోట్ల తో డబల్ బెడ్ రూం ఇండ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పన చేస్తున్నామని అన్నారు. నేషనల్ హౌసింగ్ బ్యాంక్ లోన్ ద్వారా 62.5 కోట్లు మంజూరు చేయటం జరిగింది.త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు.నిబంధనలకు అనుగుణంగా 5 కోట్ల తో ప్యాకేజీ చేసి పట్టణంలో శరవేగంగా పనులు చేపడతాం.నాణ్యతతో పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల సమయంలో ప్రజలు
సహకారం అందించాలని కోరారు.30ఫీట్లకు తక్కువ కాకుండా రోడ్లు ఉండాలి అని ప్రజలను కోరుతున్నా.

విమర్శలకు అభివృద్ధి పనులతో బదులిస్తా.జగిత్యాల పట్టణ ప్రజలు చైతన్య వంతులు అన్ని గమనిస్తున్నారు
.ఈ
కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లు మన్సూర్,గోలి శ్రీనివాస్,అడువాల లక్ష్మణ్, అహమ్మద్, బోడ్ల రాజు, చెట్పల్లి సుధాకర్,కప్పల శ్రీకాంత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ మంజూరుకు కృషి చేస్తా



- **వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ కు తిరుపతి ఎంపీ భరోసా**

**నేటి సాక్షి తిరుపతి:**దేశవ్యాప్తంగా వెటరన్ జర్నలిస్ట్ లకు జాతీయ పెన్షన్ సాధన కోసం తన వంతు కృషి చేస్తా నని తిరుపతి యంపి డా.మద్దెలగురుమూర్తి పేర్కొన్నారు. శనివారం తిరుపతి లో ఆయన కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు డా. టి.జనార్ధన్, ఎపి వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.నరేంద్ర రెడ్డి, ఆర్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు పి. వి. రవికుమార్‌లు కలసి ఎంపీకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలు సీనియర్ జర్నలిస్ట్ లకు పెన్షన్ అందజేస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. గత సంవత్సరం ఆగష్టులో కేరళ రాష్ట్ర రాజధాని త్రివేంద్రంలో జరిగిన సీనియర్ జర్నలిస్ట్స్ ప్రథమ జాతీయ మహా సభలో వెటరన్స్ కు సామాజిక భద్రత క్రింద ఆదుకోవాలని దానికై జాతీయ సమగ్ర పెన్షన్ విధానం అమలు చేస్తూ నెలకు కనీసం 25 వేలు మంజూరు చేయాలని తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. కరోనా సమయంలో రద్దుచేసిన రైల్వే పాసులు పునరుద్దరించడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి సత్వరం గతంలో లాగా రాయితీ పాసులు అందజేయాలని కోరారు. అలాగే జర్నలిస్ట్ కుటుంబ సభ్యులకు ఆరోగ్య బీమా వర్తింప చేసి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించేలా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దేశ వ్యాప్తంగా జర్నలిస్ట్ లను ఆదుకొనేందకు మీడియా కమిషన్ ఏర్పాటు చేసి వేజ్ బోర్డు సిపార్సులు పటిష్టంగా అమలు కు కృషి చేయాలని తెలిపారు. ఈ డిమాండ్స్ పట్ల ఎంపీ సానుకూలంగా స్పందించి రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో జర్నలిస్ట్ ల సమస్యలు సభదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# మనసాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



**నేటి సాక్షి,గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం బిజెపి మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో మానస దేవి ఆలయంలో సోమనాథ్ స్వాభిమాన పర్వం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026 జనవరిలో ఘజనీ మహమ్మద్ అమర్నాథ్ ఆలయం పై దాడి చేసి మందిరాన్ని కూల్చివేశాడు. విశ్వాసం, నాగరికతకు సంబంధించిన ఈ గొప్ప చిహ్నంపై అనాగరిక దండయాత్ర జరిగి 2026 సంవత్సరంకు 1000 సంవత్సరాలు పూర్తయింది. సోమనాథ్ మందిరం ఈ 1000 సంవత్సరాల సహనాన్ని, పునరుజ్జివనాన్ని నిరంతరం నిలబడ్డానికి గుర్తుగా మనం ఈ సంవత్సరాన్ని సోమనాథ్ స్వాభిమాన పర్వంగా జరుపుకుంటున్నాము. 1000 సంవత్సరాలు ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ ఆలయం ఇప్పటికీ సగర్వంగా, వైభవోపేతంగా నిలబడింది. సోమనాథ్ వైభవాన్ని పునరుద్ధరించడానికి జరిగిన నిరంతర, సమిష్టి ప్రయత్నాలకు ఇది చిహ్నం. మందిర నిర్మాణం 75వ వార్షికోత్సవం కూడా 2026 లోనే జరుగుతుంది 1951 మే 11న అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ సమక్షంలో సోమనాథ్ ఆలయాన్ని భక్తుల కోసం తెరిచారు. 2026 దండయాత్ర మూడు రోజుల పాటు కొనసాగింది. ఈ హృదయ విధారక గాయాన్ని స్మరించుకుంటూ సోమనాథ్ సమగ్రతకు నిరాజనం అర్పిస్తూ, ఈ రోజు మానసా దేవి ఆలయంలోని శివునికి ఓంకార మంత్రం పఠించి అభిషేకం ఘనంగా నిర్వహించడం జరిగింది. వీరి వెంట బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, మనసాదేవి ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ మచ్చ మురళీకృష్ణ, సందవేని ప్రశాంత్ యాదవ్, టేకు అనిల్, బద్దం వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, బద్దం శివరెడ్డి, కాటిపెల్లి అజయ్ రెడ్డి, సన్నీ, ఆలయ ప్రధాన అర్చకులు పెండ్యాల అమర్ నాథ్ శర్మ పాల్గొన్నారు.

# నత్త నడకన షాదీఖానా నిర్మాణ పనులు

**నేటి సాక్షి, ఎండపల్లి:** జగిత్యాల జిల్లా ఉమ్మడి వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామ శివారులో కరీంనగర్ రాయపట్నం ప్రధాన రహదారి పక్కన నిర్మిస్తున్న షాదీ ఖానా (వివాహ భవనం) నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. మైనార్టీల సంక్షేమానికి తోడ్పాటు అందించేలా గత ప్రభుత్వ హయాంలో అప్పటి సంక్షేమ మంత్రి మంత్రి కొప్పుల ఈశ్వర్ మైనార్టీ శాఖ ప్రత్యేక నిధుల నుండి 30 లక్షల రూపాయలు కేటాయించడంతో 2023లో ప్రారంభమైన నిర్మాణ పనులు నేటికి ఆలస్యంగా సాగి.. ప్రస్తుతం అర్ధంతరంగా ఆగిపోయాయి. దీనిపై పలుమార్లు ముస్లిం పెద్దలు సంబంధిత అధికారులను సంప్రదించిన నిధులు లేవని, కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగా షాదీ ఖానా నిర్మాణం జరగడం లేదని అంటున్నారన్నారు. ఇది పూర్తయితే ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని ముస్లిం మైనారిటీలు పలు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతున్నందున ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ చూపి షాదీ ఖానా పూర్తి నిర్మాణంకు కృషి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ముస్లిం మైనార్టీలు కోరుతున్నారు.



# మీట్స్ కాలేజ్ దగ్గర లారీబోల్తా



**నేటి సాక్షి చిలుకూరు :** సీతారాంపురం గ్రామ సమీపంలో కడప నుండి ఖమ్మం వెళ్తున్న లారీ అదుపుతప్పి కాలువలో పడింది వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని డ్రైవర్ కి స్వల్ప గాయాలు కాగా అంబులెన్స్ సాయంతో ఏరియా హాస్పిటల్ కి తరలించారు

# భద్రత నియమాలు పాటించాలి

**విద్యుత్ శాఖ ఏఈ దొంతి శ్రీధర్**



**నేటి సాక్షి జగిత్యాల (పూరెళ్ల బాపు):** విద్యుత్ వినియోగ దారులు భద్రతా నియమాలు పాటించాలని విద్యుత్ శాఖ ఏఈ దొంతి శ్రీధర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో శనివారం ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల నివారణపై ఏఈ శ్రీధర్ మాట్లాడుతూ. నాణ్యమైన విద్యుత్ వైర్లను వాడుకోవాలని సూచించారు. వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.వినియోగదారులు విద్యుత్ పరంగా ప్రతి గ్రామంలో , ఇంటిలో గాని అంతరాయం కలిగితే విద్యుత్ సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదిస్తే త్వరతితగతిన సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్ట రాజేందర్, ఉపసర్పంచ్ అగునురి గంగారాం, మాజీ సర్పంచ్ బోల్లే గంగారాం, మాజీ ఉపసర్పంచ్ రాజేశ్వర్ రావు, వార్డు సభ్యులు గంగాధర్, బట్టులత వేణు, నాయకులు ముంజల శేఖర్, లచ్చన్న చావీ లు శ్రీనివాస్, సంతోష్ తదితరులు ఉన్నారు. అనంతరం ఏ ఈ శ్రీధర్ ణు సర్పంచ్ రాజేందర్ శాలువాతో సత్కరించారు.

# పొలం బాట పట్టిన ట్రైనీ ఐఏఎస్



**నేటి సాక్షి జగిత్యాల(పూరెళ్ల బాపు):** జగిత్యాల జిల్లాకు నియమింపబడిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి పొలం బాట పట్టి గ్రామీణ ప్రజల స్థితిగతులను తెలుసుకున్నారు.ధర్మపురి మం. తిమ్మాపూర్, బూరుగుపల్లి గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి పర్యటించారు. పొలంలో వ్యవసాయ కూలీలతో మమేకమై వరినాట్లు వేసి గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. వ్యవసాయ పనులు చేసే వారికి లంచ్ సమయంలో పండ్లుపంపిణీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ గ్రామీణ మహిళల తో కలిసి పొలంలో వరి నాట్లు వేసి సంతోషం వ్యక్తం చేశారు.

# సిటీ మార్ట్‌ను ప్రారంభించిన మోహిత్ రెడ్డి



**నేటి సాక్షి తిరుపతి:** తిరుపతి నగరంతో పాటు శివారు గ్రామాల ప్రజలకు అతి తక్కువ ధరలకు నాణ్యమైన ప్రొవిజన్స్‌ను అందించడానికి ఏర్పాటు చేసిన సిటీ మార్ట్‌ను శనివారం చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త, తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం సమీపంలోని సిటీ మార్ట్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సిటీ మార్ట్ యజమానికి ప్రతాపరెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం సిటీమార్ట్ దినదినాభివృద్ధి చెందుతూ మరికొన్ని బ్రాంచిలతో పల్లెల్లో విస్తరించాలని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆకాంక్షించారు.

# ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం

- సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్

**నేటి సాక్షి జగిత్యాల(పూరెళ్ల బాపు):** సంక్రాంతి పండుగ దృష్ట్యా ప్రజలు పెద్ద ఎత్తున స్వగ్రామాలకు ప్రయాణాలు చేస్తుంటారని, ఇదే అవకాశంగా భావించి దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ప్రజలను అప్రమత్తం చేశారు. పండుగ కోసం ఊర్లకు వెళ్లే వారు తప్పనిసరిగా ముందస్తు భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను ఇంట్లో వదిలివేయకుండా తమ వెంట తీసుకెళ్లాలని లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. జిల్లాలో చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేశామని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

### చోరీల నివారణకు పోలీసుల సూచనలు

ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం బయటకు కనిపించకుండా పరదా లేదా కవర్‌తో కప్పి ఉంచాలి. మెయిన్ డోర్‌ను లోపల నుంచి లాక్ చేసి, పక్క డోర్లు వెనుక ద్వారాలకు కూడా తాళాలు వేయాలి. ఊరు వెళ్లేముందు బంగారు, వెండి, నగదు వంటి విలువైన వస్తువులను బీరువాలో ఉంచకూడదు. బ్యాంకు లాకర్లలో భద్రపరచడం ఉత్తమం. విలువైన వస్తువులు, ఆర్థిక విషయాలకు సంబంధించిన సమాచారం ఇతరులతో పంచుకోవద్దు. బీరువా తాళాలను కప్‌బోర్డులు లేదా సులభంగా కనిపించే ప్రదేశాల్లో ఉంచకూడదు. ఊరు వెళ్లేటప్పుడు పక్కింటివారికి, అలాగే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. దీంతో రాత్రిగస్తీ సమయంలో ఇంటిపై ప్రత్యేక నిఘా ఉంటుంది. రాత్రి వేళల్లో ఇంట్లో కనీసం ఒక గదిలో లైట్ వెలుగుతూ ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు లేదా కొత్త వ్యక్తులు ఇంటి చుట్టూ తిరుగుతున్నట్టు కనిపిస్తే వెంటనే 100కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. ఇంటికి సీసీ కెమెరాలు అమర్చుకుని, మొబైల్‌కు నోటిఫికేషన్ వచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి బయట నాలుగు దిక్కులు కవర్ అయ్యేలా కెమెరాలు



ఉండాలి. చుట్టుపక్కల వారిని ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పి వెళ్లాలి. ఇంట్లో ఉన్న మహిళలు, వృద్ధుల వద్దకు అపరిచితులు సమాచారం అడుగుతూ వస్తే నమ్మవద్దని ముందుగానే చెప్పాలి. ప్రజల అప్రమత్తత, పోలీసుల సమన్వయంతోనే నేరాలను పూర్తిగా నియంత్రించవచ్చని ఎస్పీ అశోక్ కుమార్ స్పష్టం చేశారు.

# ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



- జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్

**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలు స్వగ్రామాలకు, ఇతర పట్టణాలు మరియు దూర ప్రాంతాలకు ప్రయాణం చేయనున్న నేపథ్యంలో, ఇళ్లకు తాళం వేసి వెళ్లే సమయంలో దొంగతనాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ గారు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా నిరంతర పోలీస్ పెట్రోలింగ్‌తో పాటు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దీర్ఘకాలం పాటు ఇళ్లను మూసివేసి వెళ్లే వారు తమ ప్రయాణ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ముందుగా నమోదు చేయాలని సూచించారు. ఇళ్లకు తాళాలు వేయేటప్పుడు అన్ని తలుపులు, కిటికీలు బలంగా మూసి, భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. విలువైన వస్తువులు, నగదు మరియు బంగారు ఆభరణాలను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచాలని సూచించారు. అలాగే పొరుగువారికి లేదా సమీప బంధువులకు తమ ప్రయాణ వివరాలు తెలియజేయాలని, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం ద్వారా అదనపు భద్రత పొందవచ్చని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించిన వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ సంక్రాంతి పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

# పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలు

- వేతన సవరణ వెంటనే మంజూరు చేయాలి
- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ




**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్:** అసిఫాబాద్ నేడు ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ PRTU తెలంగాణ రాష్ట్రం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి నూతన సంవత్సరం-2026 డైరీ, క్యాలెండర్‌ను ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు శ్రీమతి కోవ లక్ష్మీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మీ గారు మాట్లాడుతూ, ఉద్యోగులు మరియు ఉపాధ్యాయులకు గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం మధ్యంతర భృతి (ఇంటిరిం రిలీఫ్) మాత్రమే ఇప్పటికీ కొనసాగుతుందని, కానీ వేతన సవరణ సంఘం PRC ఇప్పటివరకు ప్రకటించలేదని తెలిపారు. ప్రస్తుతం 6 కరువు భత్యాలు (DA) పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే పెండింగ్ బిల్లులను కూడా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ (TET) నుంచి మినహాయింపు ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో

ఏటుకూరి శ్రీనివాసరావు, సునార్కర్ అనిల్ కుమార్, ఉప్పుల నరసింహాచారి, పత్తిపాక శ్రావణ్ కుమార్, ఇస్లావత్ గోర్ సింగ్, సోనేరావు, ఉప్రే వినేష్, రతన్, విజయేష్, ప్రవీణ్, వినోద్, గుండు యాదగిరి, కుమురం శ్రీను, జాడి శ్రీనివాస్, సాంబశివరావు, ఉదయ బాబు, ఇందారపు ప్రకాష్, ఓం ప్రకాష్, శ్రీలత, సునిత, సుజాత, గంగాభవాని, కవిత తదితరులు పాల్గొన్నారు.

# సంబరాల్లో నాయకులు.. అవస్థల్లో ప్రజలు



- కరీంనగర్ కోర్టు చౌరస్తాలో
- నడిరోడ్డుపైనే బహిరంగ సభ
- ఉదయం నుంచే బారికేడ్లతో రాకపోకల నిలిపివేత

**నేటిసాక్షి, కరీంనగర్:** కాంగ్రెస్ నాయకుల సంబరాలు సామాన్య ప్రజానీకాన్ని అవస్థల పాల్జేసింది. కరీంనగర్‌లో అత్యంత రద్దీగా ఉండే కోర్టు చౌరస్తాలో నడిరోడ్డుపైనే బహిరంగ సభను ఏర్పాటు చేయడం విమర్శలకు తావిచ్చింది. భారీఎత్తున బారికేడ్లను ఏర్పాటుచేసి ఉదయం నుంచే అటువైపుగా వెళ్లే వాహనాలను నిలిపివేయడం సర్వత్రా చర్చకు దారితీసింది. టీపీసీసీ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా నియామకమైన తర్వాత కవ్వంపల్లి సత్యనారాయణ తొలిసారి కరీంనగర్‌కు వస్తున్న సందర్భంగా శనివారం కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో బహిరంగ సభ ఏర్పాటుచేశారు. దీనికోసం ఉదయం నుంచి ఎస్సారార్ కళాశాల నుంచి కోర్టు చౌరస్తా మీదుగా బస్టాండుకు వెళ్లే రహదారిని మూసివేశారు. కోర్టు చౌరస్తా వద్ద బహిరంగ సభకు వేదికను సిద్ధం చేసేందుకు పెద్దఎత్తున బారికేడ్లను ఏర్పాటుచేసి, అటువైపుగా వెళ్లకుండా చేశారు. దీంతో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో వచ్చే ప్రయాణీకులు కోర్టు చౌరస్తా వద్ద దిగేందుకు వీల్లేకుండా పోయింది. జిల్లా ప్రధానాసుపత్రితో పాటు చాలావరకు ఆసుపత్రులన్నింటికి వెళ్లాలంటే కోర్టు చౌరస్తా వద్దనే దిగాల్సి ఉంటుంది. దీంతో చేసేది లేక ఆసుపత్రులకు వెళ్లాల్సిన చాలా మంది వేరే చోట్ల దిగి వ్యయప్రయాసలకోర్చి ఆసుపత్రులకు చేరుకోవడం కనిపించింది. అసలు కరీంనగర్ నగరంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకోవడానికి, బహిరంగసభను ఏర్పాటుచేసుకోవడానికి స్థలమే దొరకలేదా? అని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులిచ్చిన అధికారులు కూడా ఒకసారి ఆలోచిస్తే బాగుండేదనే అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# భద్రతా సూచనలు

### ఫ్యూచర్ సిటీ పోలీస్



**నేటి సాక్షి , రంగారెడ్డి జిల్లా:** ఇల్లు వదిలి వెళ్లేముందు తలుపులు, కిటికీలు బలమైన తాళాలతో తాళం వేయండి. నగదు, ఆభరణాలు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచండి. ప్రధాన ద్వారం వద్ద తెరలు ఉపయోగించి తాళాలు కనిపించకుండా చూడండి. టైమర్లు ఉపయోగించి లైట్లు కొంత కొంతసేపు వెలిగేలా చేయండి. సాధ్యమైతే బంధువులు లేదా కుటుంబ మిత్రులను ఇంట్లో ఉండమని కోరండి. పొరుగువారు, భద్రతా సిబ్బంది వాచ్‌మెన్, RWAలకు సమాచారం ఇచ్చి నిఘా ఉంచమని చెప్పండి. సోషల్ మీడియాలో మీ ప్రయాణ వివరాలు పంచుకోకండి. భద్రతా సిబ్బంది అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా విచారించి గుర్తింపు ధృవీకరించాలి. హాస్టల్ వార్డెన్లు, లాడ్జ్ యజమానులు అనుమతి లేని వ్యక్తులను ఉండనివ్వకూడదు; ఐడీ రికార్డులు తప్పనిసరి. సీసీటీవీ, అలారమ్ వ్యవస్థలు సరిగా పనిచేస్తున్నాయో చూసుకోండి. వాహనాలను సురక్షితమైన, వెలుతురు ఉన్న ప్రదేశాల్లో పార్క్‌ఏ చేయండి. ఏవైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వండి. ఫ్యూచర్ సిటీ పోలీస్ మీ భద్రతే మా లక్ష్యం

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

### ఆటపాటలతో సంబరాలు...

### సంక్రాంతి పండగ సంబరాలు......

### గాలిపటాలలు ఎగరవేస్తూ విద్యార్థుల ఆనందాలు....



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని గౌతమ్ మోడల్ హై స్కూల్లో శనివారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం జరిగింది. సంబరాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, కైట్ ఫెస్టివల్, మరియు రంగవల్లుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ రాధిక,ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# రిషి హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు



**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** మరికల్ మండల కేంద్రంలోని రిషి హై స్కూల్లో శనివారం సంక్రాంతి సంబరాలు పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ పద్ధతుల్లో గంగిరెద్దుల వేషధారణతో వారి కృత్యాలను అద్భుతంగా ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. అలాగే హరిదాసు వేషధారణలో పాల్గొన్న పిల్లలు సంప్రదాయ గీతాలు, నృత్యాలతో సంక్రాంతి సంస్కృతిని మరింత ఉజ్జ్వలంగా ప్రతిబింబించారు. ఈ కార్యక్రమాలు పిల్లలకు ఎంతో ఆనందాన్ని కలిగించడమే కాకుండా, మన సంప్రదాయాల పట్ల గౌరవం, ఆసక్తి పెంపొందించేలా నిలిచాయి. పాఠశాల ప్రాంగణం అంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయానికి స్థలం మంజూరు చేయాలి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** చౌడేపల్లి పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా, ఉన్నటువంటి బీసీ కాలనీలో దేవస్థానం నిర్మాణానికి స్థలం ,కేటాయించాలని కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు, సంవత్సరాల తరబడి కాలనీలో దాదాపు 50 కుటుంబాలు నివసిస్తున్నామని అయితే కాలనీలో ఎలాంటి దేవస్థానం లేదన్నారు, దీంతో బీసీకాలనీలోనే ఉన్న ఆరుసెంట్లు స్థలాన్ని ప్రభుత్వం నిర్మాణానికి, కేటాయించాలని వారు కోరుతున్నారు. ఆ స్థలంపై ఎవరికి హక్కు లేదని ప్రభుత్వమే తమకు పంపిణీ చేయాలని ఈ సందర్భంగా కాలనీ మహిళలు కోరారు, ఈ కార్యక్రమంలో బీసీ కాలనీ మహిళలు పాల్గొన్నారు

# ప్రభుత్వ కళాశాలలో సంక్రాంతి సంబరాలు



**నేటి సాక్షి తిరుపతి:** వెదురు కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డా. అన్నపూర్ణ శారద హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించి ఆధునిక ప్రపంచానికి భారతీయ సంస్కృతి-సంప్రదాయాలను పరిచయం చేసే బాధ్యత ప్రస్తుత విద్యార్థులపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో భోగిమంట వేసి, పొంగలి చేసి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి వచ్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పండుగ ఉద్దేశ్యాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా వివిధ సాంస్కృతిక, క్రీడా పోటీలను నిర్వహించారు. ఐక్యుసి కోఆర్డినేటర్ డా. వెంకటేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. మంగళ గౌరీ నిర్వహన, కల్చరల్ కోఆర్డినేటర్ డా. భీమ మోహన్ రావు ఆధ్వర్యంలో వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు రెడ్డమ్మ, ఆఫ్రిన్, శిరీష, రాజకుమార్, రాకేష్, దుర్గాప్రసాద్‌లు ప్రదర్శించిన నాటిక విశేషంగా ఆకట్టుకుంది. డా. భీమ మోహన్ రావు రచించి, దర్శకత్వం వహించిన "సంక్రాంతి పండుగ అంటే సెలవేనా? సంస్కృతినా?" అనే నాటిక లో పండుగల అసలైన ఉద్దేశ్యాన్ని, విలువలను చాటే అంశాలతో చక్కని ప్రదర్శిన చేశారు. ఈ ప్రదర్శన విద్యార్థులను ఆలోచింపజేస్తూ పండుగల విలువను తెలియజేసింది. డా. ప్రభాకర్ రావు మరియు అధ్యాపకులు భారతీయ విలువల గురించి సభలో మాట్లాడారు. మొత్తం మీద సంక్రాంతి సంబరాలు విద్యార్థుల్లో సంస్కృతి పట్ల అవగాహన పెంపొందిస్తూ ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి.

# పల్లెకు రానున్న ముఖ్యమంత్రి నారా

- సంక్రాంతి పర్యటన ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలకు కూడా తావివ్వరాదు
- జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్
- ముందస్తు భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలి
- ఎస్పీ సుబ్బరాయుడు



**నేటి సాక్షి తిరుపతి:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ. నారా చంద్రబాబు నాయుడు తన స్వగ్రామమైన నారా వారిపల్లెకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై నారావారిపల్లెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సీ) ఆవరణలో లిలిముందస్తు భద్రత ASL Advance Security Liaison.లో భాగంగా జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, డీపీవో సుశీల దేవి, అదనపు ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీన సాయంత్రం 5.20 గంటలకు ముఖ్యమంత్రి రంగంపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని, అనంతరం రోడ్డు మార్గాన నారావారిపల్లెకు చేరుకుంటారని తెలిపారు. అక్కడ బస చేయడంతో పాటు, గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారని వెల్లడించారు.

### భద్రతపై ఎస్పీ ఆదేశాలు

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. హెలిప్యాడ్ వద్ద నుంచి ముఖ్యమంత్రి నివాసం వరకు పోలీస్ బందోబస్తు పక్కాగా ఉండాలని, ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. ముఖ్యమంత్రి రాకపోకల మార్గాల్లో భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### పర్యటన ప్రదేశాల పరిశీలన

సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌తో కలిసి ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలు, ప్రారంభోత్సవం చేయనున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



**నేటి సాక్షి అనంతగిరి:** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ ఇందిరమ్మ కాలనీ నివాస ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఇళ్ల మధ్య ఏర్పాటు చేయవద్దని అమీనాబాద్ ఇందిరమ్మ కాలనీ ప్రజలు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు మాత్రం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు ఆడుకునే ప్రదేశాలు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతాల్లోనే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదకరమైన ఈ చర్య వల్ల ఎలాంటి అనుకోని ప్రమాదాలు జరిగినా బాధ్యత ఎవరు తీసుకుంటారని స్థానికులు నిలదీస్తున్నారు...విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల వల్ల అగ్నిప్రమాదాలు, విద్యుత్ షాక్‌లకు అవకాశం ఉండటంతో పాటు, వర్షాకాలంలో ప్రమాదం మరింత పెరుగుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని నివాస ప్రాంతాలకు దూరంగా ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, ప్రమాదకర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్లను తక్షణమే తొలగించి, ప్రజలకు భద్రత కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# సిపిఐ శతాబ్ది ముగింపు సభను జయప్రదం చేయండి

- లక్షలాది మందితో భారీ బహిరంగ సభ - హరినాథ్ రెడ్డి పిలుపు
- సంపూర్ణ స్వాతంత్ర్య నినాదం నుంచి భూ పోరాటాల వరకు సిపిఐ గణ చరిత్ర



**నేటి సాక్షి,తిరుపతి:** సిపిఐ తిరుపతి జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు విశ్వనాథ్ అధ్యక్షతన సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. హరినాథ్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో సిపిఐ 100 సంవత్సరాల గణ చరిత్రను పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18న ఖమ్మం పట్టణంలో లక్షలాది మందితో భారీ శతాబ్ది ముగింపు బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు తిరుపతి జిల్లా నలుమూలల నుంచి సిపిఐ శ్రేణులు, ప్రజాసంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన తొలి రాజకీయ పార్టీ అని హరినాథ్ రెడ్డి గుర్తు చేశారు. "దునియా వాడికి భూమి" నినాదంతో అనేక భూ పోరాటాలు నిర్వహించి పేదలకు భూమి పంచిన ఘనత సిపిఐదేనని అన్నారు. అలాగే ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు అందించి అనేక కాలనీల నిర్మాణానికి సిపిఐ కృషి చేసిందని, తిరుపతి పరిసర ప్రాంతాల్లోనే 25 కాలనీల నిర్మాణానికి సిపిఐ చరిత్ర ఉందని పేర్కొన్నారు. బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను రద్దు చేస్తూ, 29 కార్మిక చట్టాలను తొలగించి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి గ్రామీణ కార్మికులను ఉపాధి లేకుండా చేస్తున్నారని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై రానున్న కాలంలో సిపిఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, ప్రజలు పెద్ద ఎత్తున ఈ పోరాటాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి. మురళీ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టవలసిన పోరాటాలు, నిర్మాణ కార్యక్రమాలు, ప్రజాసంఘాల కార్యకలాపాల నిర్వహణపై సమీక్షించారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో జిల్లాలో నిర్వహించాల్సిన పోరాట కార్యక్రమాలను ఖరారు చేశారు. ఈ సమావేశంలో విశ్వనాథం, రాధాకృష్ణ, బండి చలపతి, చంద్రశేఖర్ రెడ్డి, నదియా జనామాల, గురవయ్య, చిన్ని రాజ్, సుధాకర్ రెడ్డి, ఉదయ్ కుమార్తో పాటు జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## పలు ఫిర్యాదులపై విచారణ





**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా, చౌడేపల్లి మండలం, దిగువపల్లి పంచాయతీల్లో. శక్తి క్షేత్రం బోయకొండలో పలు ఫిర్యాదులపై విచారణ జరిగింది. కొండపై ప్రస్తుత ఈవో ఏకాంబరం పలు అవినీతి పనులు చేస్తున్నారంటూ రాష్ట్ర పాల ఏకిరిల చైర్మన్ నాగేశ్వరరావు నాయుడు ,రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కు. ఫిర్యాదు చేశాడు దీంతో కాణిపాకం ఈవో పెంచల కిషోర్. విచారణ అధికారిగా బోయకొండకు వచ్చారు, తొలుత ఫిర్యాదు అయిన నాగేశ్వరరావును విచారించి అనంతరం ఈవో ఏకాంబరంను. ఆయన విచారణ చేపట్టారు అదేవిధంగా పలువురు కొండ కింద అభివృద్ధి పనులలో భాగంగా గృహాలు కోల్పోయిన వ్యక్తులు నష్టపరిహారం, చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విచారణ అధికారి కిషోర్ ను కోరారు ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుండి ఆదేశాలు వచ్చాయని ఈ సందర్భంగా వారు, ఆయన దృష్టికి తీసుకువెళ్లారు వీటన్నింటిని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి అందరికీ న్యాయం చేస్తానని, ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మను దర్శించుకుని లడ్డూ పోటు ఇతర ప్రదేశాలలో ఆయన తనిఖీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ అధికార సిబ్బంది పాల్గొన్నారు,

## చుక్కలన్నీ ముగ్గులై..


### పారమిత ఆధ్వర్యంలో

### అలుగునూర్లో ముగ్గుల పోటీలు..



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** ఆకాశంలోని చుక్కలన్నీ.. నేలమీదకు జారి ముగ్గులైనట్లుగా మారింది అలుగునూర్ గ్రామంలోని రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణం. గ్రామంలోని పారమిత విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించగా, గ్రామ యువతులు.. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు 30కి పైగా మంది పోటీలో పాల్గొని అందమైన ముగ్గులు వేయగా, వాటిలో మొదటి ఐదింటికి బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ ప్రైజ్లు అందించారు. పారమిత ప్రిన్సిపాల్ శ్రీకర్, తిమ్మాపూర్ మండల ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ బత్తుల రాకేశ్, గ్రామ పెద్దలు జేవీ మల్లారెడ్డి, జాప రవీందర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు



**నేటి సాక్షి శంకర్‌పల్లి:** మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో శంకర్‌పల్లి, చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ లు యోగేష్, వెంకటేష్ శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్‌లు కలిసి వారికి స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను బహుకరించారు. వారు మాట్లాడుతూ స్వామివారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆనందంగా ఉండాలని, స్వామివారిని కోరుకున్నట్టు తెలియజేశారు.

## మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

### ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి



**నేటి సాక్షి, జగిత్యాల(గుండ ప్రశాంత్ గౌడ్):** జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి మరియు సిబ్బంది ఆధ్వర్యంలో నిషేధిత చైనా మాంజా విక్రయాలపై విస్తృత తనిఖీలు నిర్వహించటం జరిగింది. ఈ తనిఖీల్లో భాగంగా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గాలిపటాల దుకాణాలు, స్టేషనరీ షాపులు మరియు తాత్కాలిక విక్రయ కేంద్రాలను పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా చైనా మాంజా వలన మనుషులకు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు మరియు చిన్నారుల ప్రాణాలకు తీవ్రమైన ప్రమాదం ఉందని దుకాణదారులకు వివరించడం జరిగింది. అలాగే, ఎవరైనా నిషేధిత చైనా మాంజాను విక్రయించినా నిల్వ ఉంచినా లేదా రవాణా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు

# విధ్వంసకరమైన అభివృద్ధి నమూనా

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహాసభలో గాంధేయవాది హిమాంశు కుమార్
- క్రాంతి చైతన్య అరెస్టుపై తీవ్ర ఆందోళన



**నేటి సాక్షి, తిరుపతి:** పౌరహక్కుల సంఘం రెండు తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త క్రాంతి చైతన్యను పోలీసులు శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసిన నేపథ్యంలో, పౌరహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ 20వ రాష్ట్ర మహాసభలు శనివారం ఉదయం తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఉత్కంఠభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మహాసభల సందర్భంగా భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద ప్రజాకళామండలి కళాకారులు భావోద్వేగభరిత గీతాలు, నృత్యాలతో పౌరహక్కుల ఉద్యమంలో ప్రాణాలర్పించిన ఆరుగురు అమరవీరులకు నివాళులు అర్పించారు.

### కాషాయీకరణ - లౌకిక ప్రజాస్వామ్యం

పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేడంగి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలో "కాషాయీకరణ లౌకిక ప్రజాస్వామ్యం" అంశంపై ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రముఖ గాంధేయవాది హిమాంశు కుమార్ ప్రసంగించారు. రాజ్యాంగాన్ని నమ్ముతామని చెప్పుకునే ప్రభుత్వాలు, ఆదివాసీల కోసం చేసిన చట్టాలను ఎందుకు గౌరవించడం లేదని ఆయన ప్రశ్నించారు. గాంధేయ పద్ధతిలో పనిచేస్తున్న తమపై ఐదు సార్లు హత్యాయత్నాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'కగార్' పేరుతో వెయ్యి మందిని హతమార్చారని, అందులో నాలుగు వందల మంది మహిళలేనని పేర్కొంటూ, ఇది విధ్వంసకరమైన అభివృద్ధి నమూనా అని తీవ్రంగా విమర్శించారు.

### ప్రజాస్వామ్యంపై ప్రశ్నలు

"భారతదేశం - ప్రజాస్వామ్య పాలన" అంశంపై హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, మావోయిస్టులు రాజ్యాంగాన్ని నమ్మడం లేదని అంటున్నారని, మరి ప్రభుత్వానికి రాజ్యాంగంపై నమ్మకం ఉందా అని ప్రశ్నించారు. క్రాంతి చైతన్యపై నమోదు చేసిన సెక్షన్లు న్యాయసమ్మతమా కాదా అన్నదానిపై న్యాయవ్యవస్థ ఆలోచించాలని సూచించారు. అత్యాచార నిందితులకు బెయిల్ లభిస్తున్నప్పుడు, ప్రజల కోసం పనిచేసే వారికి ఎందుకు లభించడం లేదని వ్యాఖ్యానించారు.

### క్రాంతి చైతన్యను వెంటనే విడుదల చేయాలి

తన అధ్యక్షోపన్యాసంలో వేడంగి చిట్టిబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ మోసాలు, దోషాలను ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉందన్నారు. క్రాంతి చైతన్యను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌కు మద్దతుగా సభ అంతటా నినాదాలు మార్మోగాయి.

### అభిప్రాయాల నిషేధం ప్రజాస్వామ్యానికి హానికరం

రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు రాఘవ శర్మ మాట్లాడుతూ,
"ఎవరి అభిప్రాయాలను నిషేధించలేం. అలా చేస్తే మానవ సమాజం ముందుకు సాగదు" అని లి'లే'లిపై నిషేధం ఎత్తివేస్తూ జస్టిస్ జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు.

### వికసిత భారత్ - పౌరహక్కులు

మధ్యాహ్నం పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో "వికసిత భారత్ – పౌరహక్కులు" అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్ ప్రసంగించారు. కింది స్థాయి నుంచి పౌరహక్కుల ఉద్యమాలు వచ్చినా, రాజ్య ధోరణి మారడం లేదని, ప్రజాస్వామ్యం కొనసాగుతుందా అనే సందేహం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన పోరాటాలు మావోయిస్టులతో ప్రారంభం కాలేదని, వారితోనే అంతం కావని స్పష్టం చేశారు. అదే అంశంపై ఆర్థిక నిపుణుడు ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి మాట్లాడుతూ, 1990 నుంచి అభివృద్ధి చెందుతున్నామని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి అభివృద్ధి 5 శాతానికి మించలేదని అన్నారు. ముగింపు సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వేడంగి చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ ప్రసంగించారు. మధ్యమధ్యలో ప్రజాకళామండలి కళాకారుల పాటలు సభకు ఉత్సాహాన్ని నింపాయి.

# రౌడీ షీటర్స్‌లపై ప్రత్యేక నిఘా..



- సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే...

**నేటి సాక్షి రాజన్న సిరిసిల్ల: (కోక్కుల వంశీ)** సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో నేర ప్రవృత్తి కలిగిన రౌడీ షీట్లు,హిస్టరీ షీట్లు ఉన్న వారిపై పోలీస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వారి ప్రస్తుత కార్యకలాపాలు,కదలికలపై అరా తీసి కౌన్సిలింగ్ నిర్వహించి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సత్ప్రవర్తన దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... అసాంఘిక కార్యకలాపాలతో భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రజా జీవనానికి విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పని ఎస్పీ హెచ్చరించారు. రౌడీ షీటర్స్,హిస్టరీ షీటర్స్ ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని,ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని,నేరాలకు దూరంగా ఉండటంతో పాటు సత్ప్రవర్తనతో మెదులుతున్న వారిని గుర్తించి షీట్స్ ను తొలగించడం జరుగుతుందన్నారు.పోలీస్ అధికారులు తెలిపిన సమయాల్లో పోలీస్ స్టేషన్ హాజరు కావాలని లేని పక్షంలో వారిని బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు.శాంతియుత వాతావరణానికి భంగం కలిగించేలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని,ఏదైనా నేరానికి పాల్పడిన వారు ఎంతటివారైనా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు.

# పోలీస్ స్టేషన్‌పై ఆకస్మిక తనిఖీ

**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పనితీరును సవివరంగా పరిశీలించారు.

### రికార్డుల పరిశీలన

కేసు డైరీలు, జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్, అరెస్ట్ రిజిస్టర్, పిటిషన్ రిజిస్టర్, మాల్మత్తా రికార్డులు తదితర అన్ని రికార్డుల నిర్వహణను పరిశీలించి లోపాలు ఉన్న చోట్ల వెంటనే సరిదిద్దాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన విచారణ పూర్తి చేసి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసి గ్రామాలు, కాలనీలలో తరచూ పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా సిబ్బంది పూర్తి స్థాయి సిద్ధతతో ఉండి, సమస్యాత్మక వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, అవసరమైతే బౌండోవర్ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఫ్లాగ్‌మార్చ్‌లు, సమావేశాలపై నిఘా, మద్యం, డబ్బు పంపిణీ లాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### సంక్రాంతి భద్రత, సైబర్ అవగాహన ట్రాఫిక్ నియంత్రణపై సూచనలు



సంక్రాంతి పండుగ సందర్భంలో ప్రజలు స్వగ్రామాలకు వెళ్లి ఇళ్లు ఖాళీగా ఉండే అవకాశం ఎక్కువగా ఉన్నందున దొంగతనాలను అరికట్టేందుకు రాత్రి-పగలు పెట్రోలింగ్ బలపరచాలని ఎస్పీ ఆదేశించారు. పట్టణంలోని ప్రధాన వీధులు, కాలనీలు, మార్కెట్ ప్రాంతాలు, బస్‌స్టాండ్‌ల వద్ద పోలీసింగ్‌ను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని, ముఖ్యంగా యువతకు సైబర్ మోసాలు, ఆన్‌లైన్ లోన్స్, ఫేక్ లింకులు, న్యూ మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్, సీట్‌బెల్ట్ వాడకం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై చైతన్యం కల్పించాలని చెప్పారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలతో పాటు ఎడ్యుకేషనల్ డ్రైవ్‌లు కూడా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ సురేష్, మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ చిరంజీవి తదితర పోలీసులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కవ్వంపల్లికి ఘన స్వాగతం

**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** టిపిసిసి ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికై తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ రహదారి గుండ్లపల్లి స్టేజి వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద కటౌట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి బాణాసంచా కాల్చి కాంగ్రెస్ శ్రేణులు వారి అభిమానాన్ని చాటుకున్నారు. గన్నేరువరం మండలం లోని అన్ని గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొమ్మెర రవీందర్ రెడ్డి, చింతల శ్రీధర్ రెడ్డి, మాతంగి అనిల్, కరీంనగర్ కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి, బొడ్డు సునీల్, జువ్వాడి మన్మోహన్ రావు, చిట్కూరి అనంతరెడ్డి, దేశారాజ్ అనిల్ రాపోల్ నవీన్, న్యాత నరేష్ అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



# వనదేవతలను దర్శించుకున్న దిలీప్ గౌడ్



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):**మేడారం లో సమ్మక్క సారలమ్మ వనదేవతలను దర్శించుకున్న గన్నేరువరం వాసి ఇక్రిసాట్ ఉద్యోగి దిలీప్ గౌడ్ వీరితో పాటు శ్రీకాంత్ గౌడ్ వేములవాడ ఎస్సై బుర్ర ఎల్లే గౌడ్ సతీమణి సంధ్యారాణి గౌడ్ సాయిరోహన్ గౌడ్ రాహిత్య (హీరా)గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారం (బెల్లం)తో మొక్కులు సమర్పించుకున్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో సెమినార్



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ మరికల్ శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా సెమినార్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి శ్రీ మణికంఠ కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఆంజనేయులు సార్ ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ పున్నమియజ్ఞ భారత్ పాల్గొన్నారు. ఏబీవీపీ మరికల్ నగర కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# పట్టపగలే దొంగతనం...

### వృద్ధురాలి మెడలో 3 తులాల పుస్తెలతాడు అపహరణ...

**నేటిసాక్షి చందుర్తి (సతీష్):** చందుర్తి మండల పరిధిలోని మర్రిగడ్డ గ్రామంలో దారుణం జరిగింది.ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని దుండగులు ఆమె మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించారు. గ్రామానికి చెందిన కత్తి వేణు తండ్రి శంకరయ్య తల్లికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆమె శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా పడుకుని ఉంది. ఆ సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు ఆమె మెడలోని బంగారు గొలుసును దొంగిలించి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన చందుర్తి ఎస్సై జె. రమేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జిల్లా నుండి వచ్చిన క్లూస్ టీం సభ్యులు ఘటనా స్థలంలో కీలక ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# శోక సమయంలో సంప్రదాయ సేవలు



### జై భీమ్ సేవా సమితి ఆదర్శం

**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల కేంద్రంలోని జై భీమ్ సేవా సమితి ఎస్సీ కాలనీలో ఆదర్శ సేవలు అందిస్తూ గుర్తింపు పొందుతోంది. కాలనీలో ఎవరైనా మృతి చెందిన సందర్భంలో బాధిత కుటుంబాలకు బాసటగా నిలుస్తూ.. అంత్యక్రియలు, తద్దిన కర్మలు తదితర సంప్రదాయ కార్యక్రమాల నిర్వహణలో సమితి సభ్యులు సహకారం అందిస్తున్నారు. దుఃఖ సమయంలో కుటుంబాలకు మనోధైర్యం, భరోసా కల్పించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సమితి సభ్యులు తెలిపారు. మానవత్వాన్ని చాటుతూ నిర్వహిస్తున్న ఈ సేవలు స్థానికంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.

TGTEL/25/A1737 | NETI SAKSHI

## బీఎస్పీ పార్టీ పోటీలో ఉంటుంది

**జిల్లా అధ్యక్షుడు రావులపాటి రవి శంకర్**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** నియోజకవర్గ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో బహుజన సమాజ్ వాది పార్టీ(బీఎస్పీ) పూర్తి స్థాయిలో బరిలోకి నిలుస్తుందని జిల్లా అధ్యక్షుడు రావులపాటి రవి శంకర్ తెలిపారు. శనివారం పట్టణంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు నాలి నాగరాజు ఆధ్వర్యంలో బీఎస్పీ పార్టీ నియోజకవర్గ స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా జోనల్ ఇంచార్జి కత్తుల కాన్షీరామ్, జిల్లా అధ్యక్షుడు రావులపాటి రవి శంకర్, జిల్లా ఈసి మెంబర్ గాలిబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## వాట్సప్‌ల్లో వచ్చే ఏపీకే ఫైల్స్‌తో జాగ్రత్త

**సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి హెచ్చరిక..**



**నేటి సాక్షి రాజన్న సిరిసిల్ల :(కోక్కుల వంశీ):** ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరగాళ్లు కొత్త పుంతలు తొక్కుతున్నారని ముఖ్యంగా వాట్సప్ గ్రూపుల ద్వారా పంపే ఏపీకే (APK) ఫైల్స్ పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి సూచించారు. నేరగాళ్లు ప్రభుత్వ పథకాల పేరుతోనో లేదా భారీ డిస్కౌంట్ల పేరుతోనో పిఎం కిసాన్ పేరుతోనో, ఎస్బిఐ యోనో ఆప్ తో ఆకర్షణీయమైన ఆఫర్లను ఎరగా వేసి డాట్ ఏపీకే (apk) అని ముగిసే ఫైల్స్‌ను షేర్ చేస్తారని ఆయన తెలిపారు. వినియోగదారులు తెలియక ఆ ఫైల్‌ను క్లిక్ చేయగానే అది ఫోన్‌లో మాల్వేర్‌లా ఇన్‌స్టాల్ అవుతుందని తద్వారా మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, మెసేజ్‌లు, గ్యాలరీ సమాచారం అంతా సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా బ్యాంకింగ్ ఓటిపి (OTP)లను కూడా హ్యాకర్లు దొంగిలించి మీ ఖాతాల నుంచి నగదు మాయం చేసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దని కేవలం గూగుల్ ప్లే స్టోర్ వంటి అధికారిక సంస్థల నుంచే యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని డిఎస్పి నాగేంద్ర చారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సంక్రాంతి ప్రశాంతంగా జరుపుకోవాలి..


**తెలంగాణ రాజ్యాధికార పార్టీ**

**జిల్లా ప్రధాన కార్యదర్శి జోరిగే రజిత...**



**నేటి సాక్షి, మెట్‌పల్లి:** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జోరిగే రజిత మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని దుబ్బవాడలో శ్రియన్ నాలుగు సంవత్సరాల బాలుడు ఇంటిముందు ఆడుకుంటుండగా చైనా మాంజా గొంతుకు చుట్టుకుని తీవ్రగాయాల పాలైన విషయం తెలుసుకొని విచారం వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా పిల్లలు,పెద్దలు పతంగులు ఎగరవేయడం సంప్రదాయంగా వస్తుందని అన్నారు. సంప్రదాయ పద్ధతుల్లో ఎగర వెయ్యకుండా చైనా మాంజాను వాడడం వల్ల ప్రజలకు,పక్షులకు ప్రాణసంకటంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలకు సెలవులు రావడంతో పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించి కరెంటుకు, చెరువులకు దూరంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. సంక్రాంతి పండుగను సంప్రదాయ పద్ధతిలో జరుపుకొని సుఖసంతోషాలతో ప్రజలందరూ జీవించాలని కోరుకుంటున్నానని జోరిగే రజిత ఆశభావం వ్యక్తం చేశారు.

## ముఖ్యమంత్రిని కలిసిన రమణ



**నేటి సాక్షి తిరుపతి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఓవీ రమణ కలిశారు.. సీఎం కార్యాలయం నుండి వచ్చిన పిలుపు మేరకు ఓవి రమణ తన కుమారుడు ఓ నితిన్‌తో కలసి వెళ్లి ముఖ్యమంత్రి ని కలిశారు.. తిరుపతి లో తెలుగుదేశం పార్టీ పరిస్థితి గురించి మరియు కొన్ని ముఖ్య మైన అంశాలను సీ ఎం దృష్టికి తీసుకెళ్లారు.. అలాగే పార్టీ తరపున, ప్రభుత్వం తరపున ఎలాంటి భాద్యతలు అప్పగించినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్టు ముఖ్యమంత్రి ని రమణ కోరినట్టు సమాచారం.

# ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

- వీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి
- డీసీసీ కార్యాలయంలో ఆత్రం సుగుణక్క మీడియా సమావేశం



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వీబీజీ రామ్‌జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆసిఫాబాద్‌లోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల్ల మంగలతో కలిసి ఆమె మాట్లాడారు. గ్రామీణ పేదలు, కూలీలు, రైతుల జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త చట్టాలు పూర్తిగా ప్రజావ్యతిరేకమని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా కోట్లాది గ్రామీణ కుటుంబాలకు ఉపాధి లభిస్తోందని, అలాంటి చట్టాన్ని బలహీనపరచడం అన్యాయమని అన్నారు. వీబీజీ రామ్‌జీ చట్టం ద్వారా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పక్కనపెట్టి కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేయాలనే ప్రయత్నం జరుగుతోందని ఆత్రం సుగుణక్క ఆరోపించారు. దీనిని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టనున్నట్లు, ఉద్యమ కార్యచరణను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రజావ్యతిరేక విధానాలను విరమించుకొని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్త..

- చోరీలకు ఆస్కారం ఇవ్వొద్దు
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచనలు



**నేటి సాక్షి రాజన్న సిరిసిల్ల(కొక్కుల వంశీ):** సంక్రాంతి పండుగ సందర్భంగా చాలా మంది తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు, విహారయాత్రలకు వెళ్తుంటారు. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకొని దొంగలు చేతివాటం ప్రదర్శించే అవకాశముందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రజలను హెచ్చరించారు. ఊర్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండి, ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సంక్రాంతి దృష్ట్యా చోరీల నియంత్రణకు పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీని ముమ్మరం చేశామని, ఈ విషయంలో జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

### పోలీసుల సూచనలు

ఊరికి వెళ్లేటప్పుడు బంగారు, వెండి ఆభరణాలు, నగదు వంటి విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరచాలి. ఇంట్లో ఉంచాల్సి వస్తే రహస్య ప్రదేశంలో దాచాలి. బీరువా తాళాలు ఇంట్లో ఉంచకుండా వెంట తీసుకెళ్లాలి. సెలవుల్లో బయటికి వెళ్లేటప్పుడు సెంట్రల్ లాక్ సిస్టమ్, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్‌లను ఏర్పాటు చేసుకోవడం మంచిది. తాళం వేసి ఊరికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్ లేదా గ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వాలి. వివరాలు నమోదు చేసుకొని ఇంటిపై నిఘా ఏర్పాటు చేస్తారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్క్ చేయాలి. ద్విచక్ర వాహనాలకు చైన్ లాక్ తప్పనిసరిగా ఉపయోగించాలి. నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్‌మన్, సెక్యూరిటీ గార్డ్ లేదా పని మనుషులుగా నియమించుకోవాలి.సోషల్ మీడియాలో మీ లొకేషన్, ప్రయాణ ప్రణాళికలు, ఎక్కడికి వెళ్తున్నారనే వివరాలు పోస్టు చేయకండి.ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి. మొబైల్ ద్వారా ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను లైవ్‌గా పరిశీలించవచ్చు ప్రయాణ సమయంలో బ్యాగుల్లో బంగారు నగలు, డబ్బు ఉంచుకుంటే ఎప్పుడూ దగ్గరలోనే ఉంచుకోవాలి. బస్సులో పెట్టి కిందికి దిగితే దొంగతనాలకు అవకాశం ఉంటుంది. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. తాళం కనబడకుండా డోర్ కర్టెన్ లేదా కవర్ వేయాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వెలిగించి ఉంచాలి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చేలా చూడాలి. చెత్త, పేపర్లు, పాల ప్యాకెట్లు ఇంటి ముందు పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామం, పట్టణం లేదా కాలనీలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలి. ప్రజలు పోలీస్ శాఖ సూచనలు పాటిస్తూ సహకరిస్తే చోరీలను నియంత్రించడం సులభమవుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# సోమనాథ్ స్వాభిమాన పర్వం

- వెయ్యేళ్ల సహనం, పునరుజ్జీవనానికి స్మరణ



**నేటి సాక్షి - కోరుట్ల(రాధారపు నర్సయ్య):** సోమనాథ్ ఆలయంపై ఘజనీ దాడికి 1000 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, ఈ సంవత్సరం ‘సోమనాథ్ స్వాభిమాన పర్వం–2026’గా ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ పర్వం ఆలయ పునర్నిర్మాణం 75వ వార్షికోత్సవంతో కూడా సంబంధించిందని నిర్వాహకులు తెలిపారు. 1951 మే 11న అప్పటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో ఆలయ ద్వారాలు భక్తులకు తెరవబడ్డాయి. 1026లో ఘజనీ మహమ్మద్ చేసిన దండయాత్ర సోమనాథ్ ఆలయ చరిత్రలో చేదు అధ్యాయంగా నిలిచింది. అనేక ఆటుపోట్లను తట్టుకుని నిలిచిన ఈ ఆలయం భారత ఆధ్యాత్మికతకు, సంస్కృతికి చిహ్నంగా నిలుస్తోంది. శతాధిక నేతలు, భక్తుల విశ్వాసం, ప్రజల కృషి ఆలయ పునరుద్ధరణకు బలమైన ఆధారం అయ్యింది. కోరుట్ల పట్టణంలోని నగరేశ్వరాలయం, శ్రీ శివ మార్కండేయ కోటి నవదుర్గ దేవాలయాలులో శివలింగాలకు పాలాభిషేకం నిర్వహించారు. ప్రధాన అతిథిగా జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కస్తూరి లక్ష్మీనారాయణ ముఖ్య భూమిక వహించారు. భక్తులు హరహర మహాదేవ్ నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. పూజల్లో పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, ఎర్ర రాజేందర్, ఉపాధ్యక్షులు మైదం సత్యనారాయణ, గొనె రాజారాం, నవీన్, తోట రాజేశం, యువజన విభాగం బీజేవైఎం అధ్యక్షులు కళల సాయి చందు, రగంశెట్టి సాయి కృష్ణ, కంఠం రమణ తదితరులు పాల్గొన్నారు. సోమనాథ్ ఆలయం వెయ్యేళ్ల చరిత్రలో ఎన్నో దాడులు, విధ్వంసాలు, పునర్నిర్మాణాలను చూసింది. ఈ స్వాభిమాన పర్వం భక్తి, ఐక్యత, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కొత్త స్ఫూర్తి నింపే కార్యక్రమంగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# మాంజా విక్రయాలపై దాడులు

- రెండు షాపుల నుంచి స్వాధీనం ఇద్దరిపై కేసులు నమోదు



**నేటి సాక్షి, కోరుట్ల(రాధారపు నర్సయ్య):** సంక్రాంతి సమీపిస్తున్న సందర్భంగా కోరుట్ల పట్టణంలో నిషేధిత చైనా మాంజా విక్రయాలపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రెండు దుకాణాలపై దాడులు చేసి పెద్ద మొత్తంలో నిషేధిత చైనామాంజాను స్వాధీనం చేసుకున్నారు. చట్టాన్ని ఉల్లంఘించి మాంజా విక్రయించిన ఉప్పుగల యశ్వంత్ (20), సిరిపురం శ్రీకాంత్ (36) అనే ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చైనా మాంజా విక్రయించినా, కొనుగోలు చేసి ఉపయోగించినా లేదా ఆ మాంజా కారణంగా ఎవరైనా గాయపడినా సంబంధితులపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. నిషేధిత మాంజా ప్రాణాలకు ఋప్రమాదకరమని, ఎక్కడైనా విక్రయం జరుగుతున్నట్లు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుట్ల ఎస్ఐ ఎం. చిరంజీవి ప్రజలను విజ్ఞప్తి చేశారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



- రిజిస్ట్రేషన్‌పై రైతులకు అవగాహన కల్పించిన మండల వ్యవసాయ అధికారి సైదా నాయక్

**నేటి సాక్షి -మిర్యాలగూడ:** రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి సైదా నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం, తుంగపాడు, శ్రీనివాస్ నగర్ రైతు వేదికల్లో పీఎం కిసాన్ ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి రైతులకు అందించే అన్ని సంక్షేమ పథకాలు ఇకపై ఫార్మర్ రిజిస్ట్రీ నంబర్ ఆధారంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. రైతు సోదరులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలంటే వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ షఫీ, సంబంధిత సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# ఇంటికో హెల్మెట్ అందిస్తాం





- ఎమ్మెల్యే బిఎల్ఆర్ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి
- ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెల్మెట్ లేకుండా పెట్రోల్ పోస్తే కఠిన చర్యలు
- డీఎస్పీ రాజశేఖర్ రాజు

**నేటి సాక్షి - మిర్యాలగూడ:** త్వరలో ప్రతి ఇంటికీ హెల్మెట్ పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపడతామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బిఎల్ఆర్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఎన్ఎస్‌పి క్యాంపు గ్రౌండ్లో నిర్వహించిన "నో హెల్మెట్, నో పెట్రోల్" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, డీఎస్పీ రాజశేఖర్ రాజులతో కలిసి పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన సుమారు 500 మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనదారులతో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు తమ కుటుంబ సభ్యుల భవిష్యత్తును కూడా కాపాడుకున్నవారవుతారని తెలిపారు. హెల్మెట్ వినియోగం వల్ల ప్రమాదాల నుంచి మాత్రమే కాకుండా కాలుష్యం నుంచి కూడా కొంతవరకు రక్షణ లభిస్తుందన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, నేటి నుంచి హెల్మెట్ లేకుండా వచ్చిన వారికి పెట్రోల్ బంకుల్లో ఇంధనం సరఫరా చేయకుండా పకడ్బందీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ పోలీస్ అధికారులు, సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు



- మహంకాళి ఆలయానికి 10వేల విరాళం అందజేసిన ఉప్పల ప్రవీణ్

**నేటిసాక్షి జగదేవపూర్:** మైనంపల్లి హనుమంతరావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. శనివారం మైనంపల్లి హనుమంతరావు జన్మదినం సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి ఉప్పల ప్రవీణ్ గుప్త 10 వేల రూపాయలు విరాళం అందజేశారు. అనంతరం మహంకాళి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి, మైనంపల్లి ఆయురారోగ్యాలు, ప్రజాసేవలో మరింత పురోగతి సాధించాలని అమ్మవారి ఆశీస్సులు కోరారు. ఈ సందర్భంగా టిపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం, సంస్కృతి, సంప్రదాయాలకు ఎల్లప్పుడూ గౌరవం ఇస్తుందని అన్నారు. మైనంపల్లి జన్మదినాన్ని ఆలయంలో ప్రత్యేక పూజలతో జరుపుకోవడం శుభప్రదమని, ఆయనకు మరింత బలం, ఆశీర్వాదం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**నేటి సాక్షి పాములపాడు:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాములపాడు గ్రామంలో గ్రామ ప్రజల సహకారంతో, గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఆయనతో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎల్లయ్య, డీఎస్పీ రామాంజనేయులు నాయక్, ఎస్ఐ పి. తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ టోర్నమెంట్‌లో

మొదటి బహుమతి రూ.30,000 – స్పాన్సర్లుగా జిల్లా బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ మెంబర్, టీడీపీ యువ నాయకులు కురువ రమేష్, వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ గోపాల్, మమతా క్లినిక్ రాజు వ్యవహరించారు. రెండో బహుమతి రూ.20,000 – ఎస్వీఎల్ రంజిత్, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ కురువ నాగరాజు స్పాన్సర్ చేశారు. మూడో బహుమతి రూ.10,000 టైలర్ లింగారెడ్డి, డిష్ రామచంద్ర అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రికెట్ ద్వారా ఎంతో మంది దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చారని, గ్రామ స్థాయిలో నిర్వహించే ఇలాంటి చిన్న టోర్నమెంట్ల ద్వారా యువత భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్‌గా బ్రాహ్మణకొట్కూరు వర్సెస్ లింగాల జట్ల మధ్య జరిగిన ఇనాగ్రేషన్ మ్యాచ్‌కు ఆయన రిబ్బన్ కట్ చేసి, క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి క్రికెట్ పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తరిగోపుల నాగేశ్వరరావు, బంగారు వెంకటేశ్వర్లు, గుణశేఖర్ రెడ్డి, పల్లె రఘురాం రెడ్డి, కురువ వెంకటేశ్వర్లు, చింతల నారాయణ, వీరారెడ్డి, వెంకటస్వామి, తిమ్మయ్య, బాలస్వామి, యోహాన్, లోకేశ్వర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, బాలీశ్వర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రామ సుబ్బయ్య, ఉషేన భాషతో పాటు కొత్తపల్లె మండల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# రైతులు ఆన్ లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలి



నేటిసాక్షి జగదేవపూర్: జగదేవ్ పూర్ మండలం తిమ్మాపూర్ మరియు వట్టిపల్లి గ్రామాలలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును మండల వ్యవసాయ అధికారి యు. వసంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం లోని రైతులు అందరూ ఈ ఫార్మర్ రిజిస్ట్రీ లో నమోదు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలు పొందడానికి ఈ రిజిస్ట్రీ నెంబర్ తప్పని సరి అవుతుందని తెలిపారు. ఇప్పటివరకు నమోదు చేసుకొని రైతులకు వారి చరవాణి కి మేసేజ్ పంపించటం జరిగిందని కావున మండలంలో ఇప్పటివరకు నమోదు కానీ రైతులు అందరూ తమ సంభందిత వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర కానీ లేదా సమీప మీ సేవ సెంటర్ (రూ .15/ చెల్లించి) కు వెళ్లి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ పోసానిపల్లి రాజు,ఉప సర్పంచ్ అక్కరాజు నాగరాజు, మాజీ సర్పంచ్ తలకొక్కల శ్రీశైలం ,వట్టిపల్లి మాజీ సర్పంచ్ రజిత రాజేందర్ రెడ్డి,రైతులు అక్కరాజు రాజయ్య, వడ్లకొండ మహేష్, కొంతం కృష్ణంరాజు, వీరబత్తిని రామకృష్ణ, పెద్దులు వ్యవసాయ విస్తరణ అధికారులు కిరణ్ మరియు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# చెవిరెడ్డి ఇంట ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**నేటి సాక్షి తిరుపతి:** నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి శనివారం చెవిరెడ్డి నివాసానికి వచ్చారు. చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలసి ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్రమ మద్యం కేసులో అరెస్టయిన చెవిరెడ్డి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. గత 7 నెలలుగా చెవిరెడ్డిని అక్రమ నిర్బందంలో పెట్టిన చంద్రబాబు ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. చెవిరెడ్డి కుటుంబానికి తాము అండగా నిలబడతామని, అతి త్వరలో అక్రమ నిర్బంధం నుంచి చెవిరెడ్డి బయటకు వస్తారని పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సర్పంచ్, ఉపసర్పంచ్‌ను సన్మానించిన నాయకులు



**నేటి సాక్షి శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండల పరిధిలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులుగా గెలిచిన కురుమ కులస్తులు కొత్తపల్లి ఉపసర్పంచ్ లక్ష్మణ్, లక్ష్మారెడ్డిగూడ పాండు, హరివర్ధన్, గాజులగూడ ఆంజనేయులు లను కురుమ శాలివాహన సంఘం నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల సభ్యులు వెంకటేష్, పాండు, పత్తేపురం వెంకటేష్, బాలరాజు, వాసుదేవ్ ఉన్నారు.

# గోదాదేవి కళ్యాణానికి రండి...

## బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘుకు ఆహ్వానం



**నేటి సాక్షి - మెట్‌పల్లి:** మండలం మెట్లచిట్టాపూర్ గ్రామంలో ఈనెల 12న జరిగే గోదాదేవి కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘును శనివారం మెట్లచిట్టాపూర్ గ్రామ సర్పంచ్ సుంకెట గంగాధర్ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మెట్ పల్లి పట్టణంలోని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను అందజేసి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కాగా ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో మెట్లచిట్టాపూర్ గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన సుంకెట గంగాధర్ ను బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, మెట్ల చిట్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బద్ధం శేఖర్, వీడీసీ నాయకులు జనార్ధన్, తేలు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.